
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
బుధవారం 12 మార్చి 2025





# పీఎఫ్ కోసం పడిగాపులు

- జూలై నుంచి నిలిచిన చెల్లింపులు
- 600 మంది ఉద్యోగులకు రూ.80 కోట్లు
- జడ్పీలో బిల్లులన్నీ క్లియర్.. సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్



జిల్లా పరిషత్ కార్యాలయం

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్ సొమ్మును దారిమళ్లించి ఐదేళ్ల ఇబ్బంది పెట్టగా.. కూటమి ప్రభుత్వంలో చెల్లింపులు జరగక వారు ఇబ్బంది పడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) చెల్లింపు లు నిలిచిపోయాయి. గత ఏడాది జూలై నుంచి చెల్లింపుల్లో జాప్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది. ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌కు చెందిన సుమారు 600 మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావాల్సిన రూ.80 కోట్ల కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. సంబంధిత బిల్లులన్నీ జిల్లా పరిషత్ నుంచి ఎప్పుడో క్లియర్ చేశారు. ఇక్కడ నుంచి వెళ్లిన బిల్లులన్నీ సీఎఫ్ఎంఎస్‌లోనే పెండింగ్‌లో ఉన్నట్లు చెబుతున్నారు. నెలల తరబడి పీఎఫ్ చెల్లింపులు నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. గుంటూరు జిల్లా పరిషత్‌లో 10 వేల మంది పీఎఫ్ చందాదారులు ఉండగా వారికి సంబంధించి సుమారు రూ.300 కోట్ల పీఎఫ్ మూలధనం ఉన్నట్లు తెలుస్తోంది. వారిలో ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రతి ఉద్యోగి జీతం నుంచి ప్రతి నెలా 12 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాకు జమ చేస్తారు. ఒక వేళ ఉద్యోగికి ఇన్సూరెన్స్ లేకపోతే జీతంలో 6 శాతం సొమ్మును మినహాయించి పీఎఫ్ ఖాతాలో జమ చేస్తారు. పీఎఫ్ ఖాతాలో ఉన్న సొమ్ము ఉద్యోగి ఆర్థిక భద్రత కొరకు మాత్రమే ఉద్దేశించబడింది. ఉద్యోగి తన పీఎఫ్ ఖాతా లో ఉన్న సొమ్ముపై అవసరమైనప్పుడు రుణం పొందవచ్చు. దీంతో ఉద్యోగులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇతర అవసరాలకు వ్యాపారుల వద్ద వడ్డీరేట్లు భరించలేక పీఎఫ్ సొమ్మును వాడుకుంటుంటారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2024 జూన్ వరకు పీఎఫ్ బకాయిలు అన్నింటినీ క్లియర్ చేసింది. జూలై తర్వాత వచ్చిన బిల్లులు మాత్రం పెండింగ్‌లో ఉండిపోయాయి. జిల్లా పరిషత్‌లో ప్రతి నెలా సుమారు 100 మంది ఉద్యోగులు పీఎఫ్ రుణం కోసం దరఖాస్తు చేస్తుంటారు. ప్రతి నెలా రూ.6 కోట్లకు తగ్గకుండా పీఎఫ్ రుణాల కోసం దరఖాస్తులు వస్తుంటాయి. ప్రభుత్వం మారిన తర్వాత పాత చెల్లింపులు జరగడంతో చాలా మంది ఉద్యోగులు రుణం కోసం కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఎనిమిది నెలలుగా చెల్లింపులు నిలిచిపోయాయి.

**ఈ నెలలో చెల్లింపులు..**

ఉమ్మడి జిల్లా పరిషత్‌కు చెందిన పీఎఫ్ బకాయిలు అన్నీ ఈ నెలలో క్లియర్ అయ్యే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో పెండింగ్ బిల్లులకు ప్రభుత్వం మోక్షం కల్పిస్తుందని అంటున్నారు. ఉద్యోగులు, పెన్షనర్లు ఈ నెలలో పీఎఫ్ చేతికి వస్తుందన్న ఆశతో ఉన్నారు.

# అవకతవకలపై.. అలసత్వం

- రాయితీ యంత్రాల పంపిణీలో గోల్‌మాల్
- విచారణకు ఎనిమిది నెలల క్రితం ప్రభుత్వ ఆదేశం
- వ్యవసాయశాఖ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు
- ఇటీవలే ఆడిట్ పూర్తి.. వివరాలు బహిర్గతంపై గోప్యత
- యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు శూన్యం

రైతులకు సాంకేతిక సహకారం అందించి ఆధునిక వ్యవసాయంపై మళ్లించడం.. తద్వారా సాగులో నష్టాలను తగ్గించడం.. లాంటి లక్ష్యాలతో రైతులకు రాయితీపై ఆధునిక వ్యవసాయ పరిక రాలను ప్రభుత్వం అందిస్తుంటోంది. అయితే గత వైసీపీ హయాంలో తొలుత వీటి గురించి పట్టించుకోకుండా చివరి రెండేళ్లలో యంత్ర పరికరాలను పంపిణీ చేసింది. అయితే రైతుల పేరిట వైసీపీ నేతల అనుచరులకే పెద్దఎత్తున లబ్ధి చేకూరిందన్న ఆరోపణలు అప్పట్లోనే వెల్లువెత్తాయి. నాడు వ్యవసాయశాఖ ఈ ఆరోపణలు పట్టించుకోలేదు. అసలు రైతులే కాని వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి అడ్డగోలుగా ప్రభుత్వ ధనాన్ని దోచిపెట్టారని విమర్శలు కూడా వెల్లువెత్తాయి. ఈ పరిస్థితుల్లో కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే అవకతవకలపై విచారణకు ఆదేశించింది. అయితే ప్రభుత్వ ఆదేశాలపై వ్యవసాయ శాఖలో స్పందన లేదని రాయితీ యంత్రాల పరికరాల పంపిణీలో జరిగిన అవక తవకల వెలికితీతపై జరుగుతున్న తాత్సారంతో తేటతెల్ల మవుతోంది. తూతూ మంత్రంగా జరిపిన ఆడిట్ నివేదిక లను కూడా బహిర్గత పరచకుండా గోప్యత పాటిస్తుం డటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వంలో అనర్హులు లబ్ధి పొంది దర్జాగా అనుభ విస్తున్న వారిపై చర్యలు లేకపోగా వ్యవస్థలు చోద్యం చూడడాన్ని పలువురు తప్పుబడుతున్నారు.

**ఈ అంశాలను తేల్చాలి..**

- యూనిట్లకు ఎంపిక చేసిన గ్రూపులోని సభ్యులు ఎవరు.
- వారందరూ రైతులేనా.. ఆ ఫలాలు పొందడానికి అర్హులేనా.
- రాయితీ యంత్రాలు కేటాయించిన దగ్గర నుంచి ఎంత మంది రైతులకు అద్దెకిచ్చారు.వాటి ద్వారా వసూలైన అద్దె మొత్తాలెంత.
- యంత్రాలన్నీ రైతు సేవా కేంద్రాల్లోనే ఉంటున్నాయా లేక అమ్ముకున్నారా..
- రైతుల పేరిట తీసుకున్న వాటిలో కొన్ని యంత్రాలను ఏకంగా అమ్మేసుకున్నారు.. వీటిని గుర్తించాలి.

**ఇళ్లల్లోనే 200 యూనిట్లు.. 450 అదృశ్యం**

ప్రభుత్వ ఆదేశాలతో యంత్ర పరికరాల ఆడిట్‌ను గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల వ్యవసాయశాఖ అధికారులు చేపట్టారు. రైతు సేవా కేంద్రాల వద్ద ఉండాల్సిన దాదాపు 200 యూనిట్ల యంత్ర పరికరాలు ఇప్పటికీ వైసీపీ నేతల అనుచరుల ఇళ్ల వద్దనే ఉన్నట్లు అధికారుల పరిశీలనలో తేలినట్లు సమాచారం. మూడు జిల్లాల పరిధిలో మరో 450 వరకు పరికరాలు అదృశ్యమైనట్లు ఆడిట్‌లోనే వెల్లడైనట్లు తెలుస్తోంది. ఇళ్ల వద్దకు వెళ్లి పరికరాల పై అధికారులు విచారణ నిర్వహించడంపై అనుమానాలు వస్తున్నాయి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు రాయితీపై యంత్రాలను ప్రభుత్వాలు అందిస్తుంటాయి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అరకొరగా జారీ చేసిన యూనిట్లలోనూ అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయి. తొలి మూడేళ్ల రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ ఊసెత్తని ప్రభుత్వం చివరి రెండేళ్లలో యూనిట్లు అందించడానికి మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ఆ పరికరాలు అందుకున్నది రైతులంటే పప్పు లో కాలేసినట్లే. రైతులకు మేలు చేసే పేరిట ఈ రాయితీలను కూడా వైసీపీ నేతాగణం అనుచరులకే దోచి పెట్టిందని అప్పట్లో టీడీపీ ఆరోపించింది. ఈ రాయితీ యంత్రాల యూనిట్లలో జరిగిన కిరికిరికి సంబంధించి విచారణకు గతేడాది జూలైలోనే కూటమి ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఇప్పటి వరకు దానిపై పురోగతి ఏమిటనే దానికి వ్యవసాయశాఖ నుంచి సమాధానమే లేదు. యంత్రపరికరాలను రైతు సేవా కేంద్రాలలో ఉంచాలన్నది గత ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లోనే ఉంది. ప్ర భుత్వం మారినా ఆ ఆదేశాలు అమలు కాకపోగా ఇళ్ల దగ్గరకు వెళ్లి అధికారులు ఆడిట్ నిర్వహించడం ఏమిటన్నది తెలియాలి. ఇతర రైతులకు పరికరాలను

(మిగతా 8వ పేజీలో)

# నిరుద్యోగులకు తీపికబురు

వయో పరిమితి సడలింపుతో లబ్ధి

- పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి ఊరట
- డీఎస్సీ, గ్రూప్ పరీక్షలు రాసేవారికి ఉపయోగం



కోచింగ్ తీసుకుంటున్న నిరుద్యోగ యువత

గుంటూరు(విద్య), మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగం కోసం ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తూ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు కూటమి ప్రభుత్వం తీపికబురు చెప్పింది. ఇప్పటి వరకు ఉన్న వయోపరిమితిని సడలిస్తూ నూతన ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నిరుద్యోగుల్లో హర్షతిరేకం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం మెగా డీఎస్సీ కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగులకు, త్వరలో జరిగే గ్రూప్ పరీక్షలు రాసే వారికి ఇది ఎంతో ఉపకరిస్తుంది. వైసీపీ ప్రభుత్వంలో జాబ్ క్యాలెండర్ పేరుతో ఐదేళ్లు కాలయాపన చేసి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారు. ఒక్క సచివాలయ ఉద్యోగాలు తప్ప ఇతర ఏ పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో వేలమంది నిరుద్యోగులు ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు యూనిఫామ్ సర్వీస్ రిక్రూట్మెంట్లో రెండేళ్లు, నాన్ యూనిఫామ్ సర్వీసెస్ ఉద్యోగాల్లో 34 నుంచి 42 వరకు వయోపరిమితిని సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

**నిరుద్యోగులకు వరమే..**

ఉమ్మడి గుంటూరు జిల్లాలో డిగ్రీ, ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు ఏటా సగటున 25 నుంచి 30 వేల మంది వరకు ఉంటున్నారు. ఇంజనీరింగ్, ఇతర సాంకేతిక కోర్సులు పూర్తి చేసిన వారు ఐటీ ఉద్యోగాల వైపువెళ్తున్నారు. సాధారణ డిగ్రీతోపాటు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాల కోసం కోచింగ్ సెంటర్లలో శిక్షణ తీసుకుంటున్నారు. త్వరలో ప్రభుత్వం భర్తీ చేయనున్న మెగాడీఎస్సీ కోసం గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో వేల మంది సన్నద్ధమవుతున్నారు. కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ కొలిక్కి వచ్చింది. గ్రూప్ ఉద్యోగుల భర్తీకి నోటిఫికేషన్లు విడుదల కానున్నాయి. వయోపరిమితి సడలింపు నిరుద్యోగులకు వరమేనని యువత హర్షం వ్యక్తం చేస్తోంది.

# అభివృద్ధికి.. ఇన్‌చార్జి అధికారులు

- గుంటూరు జిల్లాకు కన్నబాబు
- బాపట్లకు కృతికా శుక్లా, పల్నాడుకు కరుణ
- జోనల్ ఇన్‌చార్జి ఆఫీసర్‌గా సాయిప్రసాదు
- ఉన్నతాధికారుల పర్యవేక్షణతో సంక్షేమం వేగవంతం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగవంతంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు వీలుగా సీనియర్ ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నియమించింది. గుంటూరు జిల్లాకు సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబుని నియమించింది. బాపట్లకు కృతికాశుక్లా, పల్నాడుకు వీ కరుణని నియమిస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడుని ఒక జోన్‌లో చేర్చి దానికి ఇన్‌చార్జి అధికారిగా స్పెషల్ సీఎస్ హోదాలో ఉన్న జీ సాయిప్రసాదుని నియమించింది. తొలుత జిల్లా ఇన్‌చార్జి అధికారులు ఆయా జిల్లాలకు వచ్చి కలెక్టర్లతో కలిసి సమీక్ష నిర్వహిస్తారు. ఆ తర్వాత జోనల్ ఇన్‌చార్జి సమావేశం ఏర్పాటు చేస్తారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ వల్ల సంక్షేమ, అభివృద్ధి ఫలాలు నేరుగా లబ్ధిదారులకు వేగవంతంగా అందుతాయని అధికారవర్గాలు తెలిపాయి.

# చేజారిన.. రూ.9.39 కోట్లు

- ఎన్నికలు జరగలేదని కేంద్రం నిలిపివేత
- ఆర్థిక ఇక్కట్లలో నరసరావుపేట మున్సిపాల్టీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట మున్సిపాల్టీ రూ.9.39 కోట్లు చేజార్చుకుంది. ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను నిలిపివేసింది. ఎన్నికలు నిర్వహించని కారణంగా మున్సిపాల్టీకి 2023-24 ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదలను నిలిపివేసింది. ఎన్నికలు జరిగి కొత్త పాలక వర్గం కొలువుదీరే వరకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయదు. ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకో వడం లేదు. ఈ పరిస్థితుల్లో మున్సిపాల్టీ ఆర్థిక ఇక్కట్లను ఎదు ర్కొంటున్నది.



**రంజాన్ వేళలు**

ఇఫ్తార్ : 6.22 (బుధవారం)


సహరి : 5.01 (గురువారం)

**వార్డుల విభజనలో తకరారు..**

మున్సిపాల్టీలో ఇస్సపాలెం, లింగంగుంట్ల, యలమందల, రావిపాడు, కేసానుపల్లి పంచాయతీల పరిధిలోని కొంత ప్రాంతాన్ని మున్సిపాల్టీలో విలీనం చేశారు. మున్సిపాల్టీలో పొరుగున ఉన్న పంచాయతీలను విలీనం చేసి వార్డుల సంఖ్యను పెంచింది. ఈ ప్రక్రియలో నిబంధనలు పాటించలేదు. మున్సిపాల్టీలో వార్డులను 34 నుంచి 38కు పెంచారు. ఈ వార్డుల విభజన సక్రమం గా జరగలేదని అభ్యంతరాలు వచ్చినా అధికారులు లక్ష్య పెట్టలేదు. ఫలితంగా మున్సిపాల్టీలో వార్డుల పునర్‌విభజన సక్రమంగా జరగలేదని బాధితులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఆయా పంచాయతీలతో పాటు పురపాలక సంఘ ఎన్నికలు కూడా నిలిచిపో యాయి. ఈ పరిస్థితుల్లో మున్సిపాల్టీతో పాటు ఆ ఐదు పంచాయతీలకు కూడా కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను నిలిపివేసింది. కేంద్ర ప్రభుత్వం అక్టోబరు.. ఫిబ్రవరి నెలల్లో విడు దల చేయగా ఆయా పంచాయతీలతో పాటు, మున్సిపాల్టీ కూడా నిధు లను కోల్పోయింది. ఈ నిధులు సమకూరి ఉంటే చాలా వరకు రహదారులు, కాల్వలు, ఇతర మౌలిక వసతుల నిర్మాణాలు చేపట్టే అవకాశం ఉండేది. ఎన్నికలు నిర్వహించకపోవడం మున్సిపాల్టీల ఆర్థిక అవకాశాలను దెబ్బతిసింది. ఆర్థిక సంఘం నిధులు నిలిపివేయడంతో ఎన్నికల నిర్వహణ తప్పనిసరైంది. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటుందో లేదో చూడాలి.

# కారం మిల్లులపై విజిలెన్స్

- రూ.17.43 లక్షల కారంపొడి స్వాధీనం
- మిర్చి, పసుపు, ధనియాలు అక్రమ నిల్వల గుర్తింపు



గుంటూరులో కారం నిల్వలను పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ తదితరులు

గుంటూరు సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండానే కారం పొడి తయారు చేసి విచ్చలవిడిగా విక్రయాలు జరుపుతున్న మిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ దాడుల్లో రూ. 17,43,500 విలువ చేసే కారం పొడిని స్వాధీనం చేసుకు న్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. గుంటూరులోని చిలకలూరిపేటరోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీగణపతి ఇండస్ట్రీస్ కారం మిల్లులో అధికారులు తనిఖీలు చేశారు. మిల్లు యజమాని బండారు రవీంద్రకుమార్ ఎటువంటి బిల్లులు, రికార్డులు లేకుండా వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. మిర్చి యార్డు దగ్గరలో ఉన్న మోహన్‌లాల్ మహేంద్రకుమార్ అండ్ కంపెనీ నుంచి బిల్లులు లేకుండా మిర్చి తీసుకువచ్చి కారం పొడి తయారు చేస్తున్నట్లు అధికారులు తేల్చారు. 13,915 కేజీల చిల్లీ పౌడర్, రూ.3,14,250 విలువ చేసే 1815 కేజీల మిరపకాయలు, 75 కేజీల పసుపు, రూ.1,06,854 విలువ చేసే 1320 కేజీల ధనియాలు బిల్లులు లేకుండా కలిగి ఉన్నారని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కారం పొడి నమూనాలను సేకరించిన ఫుడ్‌సేఫ్టీ అధికారులు నాణ్యతా ప్రమాణాలు పరిశీలనకు హైదరాబాద్‌లోని లేబరేటరీకి పంపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ పాల్గొన్నారు.

# పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు



ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ముప్పాళ్ళ మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులు చేస్తు న్న కూలీలకు పని ప్రదేశంలో మెడికల్ కిట్టు, మంచినీటి సౌక ర్యం, నీడ సదు పాయం కల్పిం చాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. మండలంలోని చాగంటి వారిపాలెంలో రైతు సైదులు పొలంలో ఉపాధిహామి నిధులతో తీస్తున్న ఫారం పాండ్ పనులను మంగళవారం పరిశీలించిన కలెక్టర్ కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా.. కూలి నగదు సకాలంలో వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. వేసవిలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని అధి కారులకు సూచించారు. చాగంటివారిపాలెంలో జరుగుతున్న పీ4 సర్వేను పరిశీలించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో కాశయ్య, తహసీల్దార్ ఎం భవానీశంకర్, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్, ఏపీడీ నారాయణ, ఏపీవో ఏడుకొండలు ఉన్నారు.

# మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాలు నిర్దేశం

- గుంటూరు జిల్లాకు రూ.64.80 లక్షలుగా నిర్దేశం
- పల్నాడు రూ.29.70 లక్షలు, బాపట్ల జిల్లాకు రూ.7.62 కోట్లు..
- ఏఎంసీల సెక్రెటరీలు చర్యలు చేపట్టాలని కమిషనర్ ఆదేశాలు


గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు రోజు వారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాని ఆ శాఖ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఎం విజయ సునీత నిర్దేశించారు. మంగళవారం చుట్టుగుంటలోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రోజు వారీ వసూళ్లతోనే ఆర్థిక సంవత్సర లక్ష్యాలను చేరుకోగలమన్నారు. ఈ విషయంలో సెక్రెటరీలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని ఎనిమిది మార్కెట్ కమిటీలకు కలిపి రోజువారి మార్కెట్ ఫీజు వసూళ్ల లక్ష్యాన్ని రూ.64.80 లక్షలుగా కమిషనర్ నిర్ణయించారు. ఇందులో గుంటూరు ఏఎంసీకి రూ.44 లక్షలు, తెనాలి రూ.5 లక్షలు, పొన్నూరు రూ.5 లక్షలు, దుగ్గిరాలకు రూ.2.50 లక్షలు, తాడికొండ రూ.2 లక్షలు, మంగళగిరికి రూ.2 లక్షలు, ఫిరంగిపురానికి రూ.2 లక్షలు, ప్రత్తిపాడుకు రూ.2.30 లక్షల లక్ష్యాన్ని నిర్దేశించారు. పల్నాడు జిల్లాకు రోజు వారి లక్ష్యం రూ.29.70 లక్షలుగా నిర్ణయించారు. ఇందులో చిలకలూరిపేటకు రూ.3.60 లక్షలు, సత్తెనపల్లికి రూ.2.30 లక్షలు, పిడుగురాళ్లకు రూ.2 లక్షలు, నరసరావుపేటకు రూ.2.10 లక్షలు, వినుకొండకు రూ.2.70 లక్షలు, క్రోసూరుకు రూ.1.95 లక్షలు, మాచర్లకు రూ.1.20 లక్షలు, రొంపిచర్లకు రూ.1.70 లక్షలు, ఈపూరుకు రూ.1.20 లక్షలు, రాజుపాలేనికి రూ.1.50 లక్షలు, దుర్గికి రూ.1.90 లక్షలు, గురజాలకు రూ.7.55 లక్షలు నిర్దేశించారు. బాపట్లలోని ఏఎంసీలన్నింటికి కలిపి రూ.30.27 కోట్లు లక్ష్యం కాగా ఇప్పటివరకు రూ.22.65 కోట్లు వసూళ్లు జరిగాయి. ఈ దృష్ట్యా ఏఎంసీల సెక్రెటరీలు తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. 50 శాతం కంటే తక్కువగా మార్కెట్ ఫీజు వసూళ్లలో తాడికొండ, సత్తెనపల్లి, మాచర్ల, రొంపిచర్ల ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మార్కెటింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలానే ఈపూరు, పిడుగురాళ్ల, కూచినపూడి, పర్చూరు, క్రోసూరు, ఫిరంగిపురం, చిలకలూరిపేట, మంగళగిరిలో 50 నుంచి 70 శాతం మార్కెట్ ఫీజుల వసూళ్లు జరిగాయి. ఇక 70 నుంచి 90 శాతం తక్కువగా దుర్గి, అద్దంకి, వినుకొండ, బాపట్ల, గుంటూరు, నరసరావుపేట, గురజాల, వేమూరు, చీరాల, రేపల్లె, ప్రత్తిపాడు, పొన్నూరు ఏఎంసీలున్నాయి. 90 నుంచి 100 శాతం వసూళ్లు చేసిన వాటిల్లో సంతమాగులూరు, దుగ్గిరాల ఉన్నాయి. 100 శాతం లక్ష్యాన్ని అధిగమించిన ఏఎంసీలు మూడు జిల్లాల్లో ఒక్కటి కూడా లేదని కమిషనర్ అన్నారు. ఈ సమావేశంలో జేడీలు కాకుమాను శ్రీనివాసరావు, రాజశేఖర్, సుధాకర్, రామాంజనేయులు, ఏడీ రాజబాబు, మిర్చియార్డు సెక్రెటరి చంద్రిక, మంగళగిరి ఏఎంసీ సెక్రెటరి భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమీక్షకు హాజరైన మార్కెటింగ్ సెక్రెటరీలు, మాట్లాడుతున్న కమిషనర్ విజయ సునీత

# విద్యావ్యవస్థను నాశనం చేసిన వైసీపీ

## చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో విద్యావ్యవస్థలో నూతనమార్పులు తెస్తామని గొప్పలు చెప్పిన వైసీపీ ప్రభుత్వం విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో భ్రష్టుపట్టించారని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అసెంబ్లీ సమావేశంలో మంగళవారం మాట్లాడారు. గత ఐదు సంవత్సరాల్లో గత పాలకులు అధికారంలోకి వచ్చాక విద్యావ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, కనీసం విద్యార్హతలు లేనివారిని విద్యాశాఖ మంత్రిగా చేసి ఈ రోజు యువత పోరు ఎలా చేస్తారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుకోవడమే సరిపోయిందని, గత ప్రభుత్వం విద్యావ్యవస్థలో ఇప్పటికీ కూడా పెండింగ్ ఉన్న బిల్లులు ఉన్నాయని, వాటిని తీర్చడానికే సమయం సరిపోతుందని, కనీసం అసెంబ్లీకి వచ్చి మాట్లాడనివారికి విద్య గురించి మాట్లాడే హక్కు ఉందా అని ప్రశ్నించారు. ఇప్పటికీ కూడా చాలా కాలేజీల్లో ఫీజులు చెల్లించక రోడ్డుమీద పడ్డారని అన్నారు. ఈ రోజు మేము పారదర్శకంగా వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సర్టిఫికెట్లు పంపిస్తున్నామని, ఈ నెల 17న జరగబోయే 10వ తరగతి పరీక్షలకు కూడా ఆర్టీసీ ద్వారా ఉచిత బస్సు కూడా విద్యాశాఖ మంత్రి లోకేష్ ప్రకటించారన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టళ్లల్లో విద్యార్థులకు చెల్లించాల్సిన బాకాయిలు చెల్లించకపోవడంతో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత లోకేష్ చొరవతో రూ.20.50కోట్లు చెల్లించడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి రూ.110 కోట్లు కూటమిప్రభుత్వం చెల్లించిందని తెలిపారు.

# జలజీవన్‌మిషన్‌కి 3025.63 కోట్లు

- గ్రామాల్లో సమృద్ధిగా తాగునీరు అందిస్తాం
- మంత్రి అనగాని



రేపల్లె, మార్చి11(ఆంధ్రజ్యోతి) : తీరప్రాంతంలో తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న గ్రామాల్లోని ప్రజలకు సమృద్ధిగా అందించేందుకు జలజీవన్ మిషన్ కింద 3025.63కోట్ల రూపాయల నిధులను మంజూరు చేయించటం జరిగిందని రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వంలో తాగునీటి కోసం కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమంకోసం పనిచేస్తుందని తెలిపారు. జలజీవన్‌మిషన్ కింద గ్రామాల్లో మినీవాటర్‌స్కీమ్‌లు ఓవర్‌హెడ్‌ట్యాంక్‌లు నూతన పైపులైన్లు, ఇంటింటికీ కుళాయిల ద్వారా పూర్తిస్థాయిలో తాగునీరు అందించేందుకు నియోజకవర్గంలోని రేపల్లెనగరం,నిజాంపట్నం,చెరుకుపల్లి మండలాల్లో 97పనులకు గాను నిధులు మంజూరు చేయించటం జరిగిందని ఆయన తెలిపారు. ఈగ్రామాల్లో ఆయా పనులను బట్టి రూ.10లక్షల నుంచి 50లక్షల వరకు నిధులు మంజూరుచెయ్యటం జరిగిందని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.



# క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

## వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని వికాస ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో 2025 వార్షిక సంవత్సరానికి సంబంధించి ఉద్యోగులకు నిర్వహిస్తున్న క్రీడలను మంగళవారం ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. గంగాధరరావు, ఇన్చార్జి రిజి స్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, వ్యాయామ విద్య డైరెక్టర్, వ్యాయామ విద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్‌లు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు మాట్లా డుతూ ఉద్యోగులు ఇటువంటి క్రీడల ద్వారా పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చునని అన్నారు. నిరంతరం విధులతో మానసిక ఒత్తిడికి గురవుతారని ఇటువంటి క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు పని ఒత్తిడి తగ్గుతుందని సూచించారు ఇటువంటి క్రీడలు ఉద్యోగుల పట్ల స్నేహభావం పెంపొందిస్తాయని అన్నారు. క్రీడలు నిరంతరం నిర్వహించాలని వికాస కార్యవర్గానికి సూచిం చారు. అనంతరం క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వికాస అధ్యక్ష,కార్యదర్శులు నీలపు ప్రసాద్, జవ్వాజి శ్రీనివాసరావు, కోశాధికారి కె. యేసయ్య, కార్యవర్గ సభ్యులు నాగరాజు,వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, శశిధర్, తదితరులు పోటీల నిర్వహణను పర్యవేక్షించారు.

### అట్టహాసంగా ప్రారంభమైన యూజీసీ సెమినార్

ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో "రీసెంట్ అడ్వాన్స్మెంట్స్ ఇన్ సాఫ్ట్వేర్ బేస్డ్ అప్రోచెస్ ఇన్ ఫార్మాస్యూటికల్ రీసెర్చ్" అనే అంశంపై జరుగుతున్న సదస్సు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు మాట్లాడుతూ ఫార్మసీ రంగాల్లో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రమీలా రాణి మాట్లాడుతూ ఇటువంటి సదస్సులు ఎంతగానో ఉపయోగంగా ఉంటాయని తెలిపారు. సదస్సు సమన్వయకర్త డాక్టర్ కే విజయ కిషోర్ మాట్లాడుతూ ఈ సదస్సుకు సుమారు 500కు పైగా రిజిస్ట్రేషన్లు వివిధ యూనివర్సిటీలో మరియు కళాశాలల నుంచి వచ్చాయని తెలిపారు. విశిష్ట అతిథి ప్రొఫెసర్ సుశీల్ శర్మ మాట్లాడుతూ ఫార్మసీ, వైద్యరంగంలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ యొక్క



వర్సిటీలో క్రీడలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు

ప్రాముఖ్యాన్ని వివరించారు. రెక్టార్ ప్రొఫెసర్ రత్న షీలా మణి విద్యార్థులకు ప్రత్యేక సందేశాన్ని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ గంగాధరరావు సదస్సు సావనీరుని విడుదల చేసి ఆవిష్కరించారు.

### 29,30 తేదీలలో అంతర్జాతీయ సదస్సు

ఏఎన్‌యూలోని ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 29, 30 తేదీల్లో గ్లోబల్ ట్రెండ్స్ ఇన్ సప్లై చైన్ అండ్ లాజిస్టిక్ మేనేజ్మెంట్ అనే అంశంపై అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ఆచార్య ఆర్ శివరాం ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం సదస్సు బ్రోచర్ ను ఇన్‌చార్జి వీసీ ఆచార్య గంగాధరరావు ఆవిష్కరించారు. సదస్సుకు ముఖ్య ప్రసంగికులుగా అమెరికాలోని వాల్డన్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ఆచార్యులుగా విధులు నిర్వహిస్తున్న ప్రొఫెసర్ కొర్రపాటి రఘు హాజరుకానున్నారని పేర్కొన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సులో అంతర్జాతీయ మార్కెట్లో నూతనంగా వచ్చిన సప్లై లాజిస్టిక్ అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి రిజిస్టర్ ఆచార్య జి. సింహాచలం పాల్గొన్నారు.

# రేషన్ బియ్యం తరలింపు కేసులో.. నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ

తెనాలి రూరల్, మార్చి11(ఆంధ్రజ్యోతి): పేదలకడుపునింపేందుకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని నల్లబజారుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న వారిలో నిందితుడిగా వైసీపీ ఎంపీటీసీ పోలీసుల రికార్డులోకి ఎక్కా రు. మండలంలోని నందివెలుగు గ్రామానికి చెందిన వైసీపీ ఎంపీటీసీ షేక్ సిలార్ జానీబాషా గత ప్రభుత్వంలో బంధువుల పేరుతో రేషన్ డీలర్ షిప్ పొందాడు. ఎండీయూ వాహనం ద్వారా బియ్యం పంపిణీకి స్వయంగా వెళుతూ లబ్ధిదారులకు బియ్యం నాణ్యమైనవి కాదని వాటిని తింటే అనారోగ్యసమస్యలు వస్తాయంటూ వారిలో రేషన్ పంపిణీ బియ్యంపై లేని పోని అపోహలు కల్పించి వేలిముద్రలు తీసుకుని బియ్యం బదులుగా కేజీకి రూ.8 నుంచి 10 వంతున ఇచ్చి పంపుతుంటాడు. ఇలా సేకరించిన బియ్యాన్ని నల్లబజార్లకు తరలించి సొమ్ముచేసుకునేవాడు. గత ప్రభుత్వంలో వైసీపీ చోటా నాయకుడు కావడంతో ఇతడివైపు అధికారులు కన్నెత్తికూడా చూసేవారు కాదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా మంగళవారం తెల్లవారుజామున సత్తెనపల్లి తరలించేందుకు రేషన్‌బియ్యాన్ని ట్రాన్స్‌పోర్టుఆటోలో లోడ్ చేసుకుని వెళుతుండగా పోలీసులను గమనించి వాహనాన్ని వెంబడించారు. దాంతో డ్రైవర్ వాహనాన్ని కొల్లిపర మండలం అత్తోట వైపు దారి మళ్లించాడు. పోలీసులు వాహనాన్ని వెంబడించి వాహనంలో ఉన్న 120 బస్తాల పీడీఎఫ్ బియ్యా న్ని అందులో ఉన్న డ్రైవర్, మరోవ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎంపీటీసీ సిలార్ జానీబాషా వద్ద కొనుగోలు చేసి సత్తెనపల్లి తరలిస్తున్నట్లు నిందితులు పోలీసులకు తెలిపారు. దీంతో తరలిస్తున్న ఇరువురిని, అమ్మిన సిలార్‌జానీబాషాను, కొనుగోలు చేసిన సత్తెనపల్లికి చెందిన మరో వ్యక్తిని కలిపి మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



రేషన్ బియ్యంతో పట్టుబడ్డ ట్రాన్స్‌పోర్ట్ ఆటో

## ఏప్రిల్ 30న రాజకీయ పార్టీలతో ఎన్నికల సంఘం సమావేశం : కలెక్టర్

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఏ ఎన్నికలైనా సజావుగా, పారదర్శకంగా జరిగేందుకు జాతీయ, రాష్ట రాజకీయ పార్టీల నుంచి సూచనలు, సలహాలు స్వీకరించేందుకు ఏప్రిల్ 30వ తేదీన న్యూఢిల్లీలోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఆర్వో, జిల్లా ఎన్ని కల అధికారి, సీఈవో స్థాయిలో పరిష్కారం జరగని సమస్యలను ఆ సమావేశంలో ప్రస్తావించ వచ్చన్నారు. గతంలో జరిగిన సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను ఈ నెల 31వ తేదీ లోపు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

### గుంటూరు మీదగా చర్లపల్లి, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు గుంటూరు మీదగా చర్లపల్లి, భువనేశ్వర్‌లకు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ శ్రీధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 08479 భువనేశ్వర్ - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 17, 24 తేదీల్లో మధ్యాహ్నం 12.10కి బయలుదేరి గుంటూరు, సత్తెనపల్లి, నడికుడి మీదగా మరుసటి రోజు ఉదయం 7.50కి చర్లపల్లి చేరుకుంటుంది. నంబరు. 08480 చర్లపల్లి - భువనేశ్వర్ ప్రత్యేక రైలు ఈ నెల 18, 25 తేదీల్లో ఉదయం 9.50కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 9.50కి భువనేశ్వర్ చేరుకుంటుంది. ఈ రైళ్లలో ఏసీ టూటైర్, త్రీటైర్, స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ బోగీలుంటాయని సీపీఆర్వో తెలిపారు.

### యూత్ పార్లమెంట్ రిజిస్ట్రేషన్ 16 వరకు పొడిగింపు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు జిల్లా స్థాయి యూత్ పార్లమెంట్ పోటీలు ఈ నెల 16 వ తేదీ వరకు పొడిగించినట్లు టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనితా దేవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక నిమిషం వీడియో అప్లోడ్ చేయడానికి తేదీ పొడిగించారని తెలిపారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, కృష్ణా, యన్‌టి ఆర్ జిల్లాల నుంచి 18 నుంచి 25 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఎవరైనా ఈ యూత్ పార్లమెంట్ పోటీలలో పాల్గొనవచ్చని, ముందుగా ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మై భారత్ పోర్టల్ లో రిజిస్ట్రేషన్ చేసుకొని తరువాత ఒక్క నిమిషం నిడివి కలిగిన "వాట్ డస్ వికసిత్ భారత్ మీన్ టూ యూ "అనే అంశం పైన వీడియో చేసి ఈనెల 16వ తేదీ అర్థరాత్రిలోగా మై భారత్ పోర్టల్ లో అప్లోడ్ చేయాలని తెలియచేశారు. వివరాలకు యూత్ పార్లమెంట్ నోడల్ అధికారి కిరణ్మయిదేవిరెడ్డిని (9849854221) సంప్రదించాలని సూచించారు.

## నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ అందించి ఉద్యోగాలు ఇప్పించటం జరుగుతుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కే సంజీవరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఆధ్వర్యంలో నల్లపాడు ఎంటీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్‌లో నిరుద్యోగ యువతకు డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్ అటెండెంట్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఈనెల 20 వ తేదీన ఈ కోర్సు తరగతులు మొదలవుతాయి, ఈ కోర్సుకు టెన్త్/ఇంటర్/డిగ్రీ విద్యార్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులని తెలిపారు. వివరాలకు 6304292828 అనే నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

### ఆర్‌బీఐ ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ఆంధ్రప్రదేశ్ రీజియన్ ఆధ్వర్యంలో మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రీజియన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విశాల్ జైశ్వాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు ఆర్‌బీఐ విశిష్టతలు, ఆన్లైన్ మోసాలపై అవగాహన కల్పించారు. అనంతరం క్విజ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య ఆర్. శివరాం ప్రసాద్, అధ్యాపకులు ఆచార్య వి.చంద్రశేఖర్, ఏ. కనకదుర్గ పాల్గొన్నారు.

### స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): బీసీ, కాపు,(కాపు, బలిజ,తెలగ,ఒంటరి), ఈబీసీ, కమ్మ,రెడ్డి,ఆర్యవైశ్యక్షత్రియ, బ్రాహ్మణ కార్పొరేషన్ల ద్వారా స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎస్ మయూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఏపీ ఓబీఎంఎంఎస్ ద్వారా ఆన్‌లైన్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 22 లోగా దరఖాస్తులు ఆన్‌లైన్ ద్వారా పంపాలని సూచించారు.

### సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 522.10 అడుగులు ఉంది. ఇది 153.13 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 8023 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 7768 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 17,871 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

# హైదరాబాద్ ఎడ్లజతకు ప్రథమస్థానం

రాజుపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఆకులగణపవరం గ్రామంలో జరుగుతున్న జాతీయస్థాయి ఎడ్ల పందెలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన జూనియర్స్ విభాగంలో హైదరాబాద్‌కు చెందిన డి రోహన్‌బాబు సామ్రాట్ బసవ ఎడ్లజత 2962 అడుగుల దూరంలాగి ప్రథమస్థానంలో, జగమెండి ఎడ్లజత 2790అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలిచాయి. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి ఎడ్లజత 2759.11అడుగుల దూరంలాగి మూడవస్థానంలో, గుంటూరు జిల్లా పెదనందిపాడు మండలం నాగులపాడు గ్రామానికి చెందిన ఆళ్ల మెహనరావు, పాటిబండ్ల శ్రీనివాసరావుల ఎడ్లజత 2478.8అడుగుల దూరంలాగి నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యాజమానులకు నగదుతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.

### వ్యవసాయ విభాగంలో బాపట్ల ఎడ్లజతకు ప్రథమస్థానం

వ్యవసాయ విభాగంలో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరిల ఎడ్లజత 4000 దూరంలాగి ప్రథమస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరు గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లజత 3926.7అడుగుల దూరంలాగి రెండవస్థానంలో నిలువగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన గరికపాటి లక్ష్మయ్య ఎడ్లజత 3893.6అడుగుల దూరంలాగి మూడవస్థానంలో నిలిచాయి. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం ఆకులగణపవరం గ్రామానికి చెందిన పుట్టా తిరుపతయ్య ఎడ్లజత నాల్గవస్థానంలో నిలిచాయి. విజేతలుగా నిలిచిన ఎడ్లజతల యాజమానులకు నగదుతో పాటు స్వామివారి చిత్రపటాలను అందజేశారు.



జూనియర్స్ విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన హైదరాబాద్ ఎడ్లజత

# ఉనికి కోసమే వైసీపీ పాట్లు : యరపతినేని



పిడుగురాళ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఎన్నికలలో రాష్ట్రంలో చిత్తు చిత్తుగా ఓడిన జగన్మోహన్‌రెడ్డి ప్రజల్లో విశ్వాసం కోల్పోయాడని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలో వుండగా ప్రజల బాధలు, సమస్యలు ఉద్యోగుల బాగోగులు, హాస్టల్ విద్యార్థుల ఫీజులకు నిధులు విడుదల చేయని జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉనికి కోసమే యువత పోరు అంటూ కొత్త నాటకానికి తెరలేపుతున్నాడన్నారు. యువతను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకొచ్చేందుకు జగన్ పిచ్చి పనులు చేస్తున్నాడని, జగన్ హయాంలో నిరుద్యోగం పెంచి ఇప్పుడు ఆపోరు ఈపోరు అంటూ డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతున్నాడన్నారు. అధికారంలోకి వచ్చే ముందు ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామన్న జగన్ మాట తప్పాడని మొదటగా రాష్ట్ర ప్రజలకు, యువతకు సమాధానం చెప్పాల్సిన అవసరం వుందన్నారు. జగన్ అధికారంలో వుండగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు 4,200 కోట్లకు పైగా బకాయిలు పెట్టి విద్యార్థుల జీవితాలతో ఆడుకున్నాడని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి నారా లోకేష్ చొరవతో ఇప్పటికే 800 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించడం జరిగిందన్నారు.

# చంద్రయ్య హత్యపై సీఐడి విచారణ హర్షణీయం

## ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



మాచర్లటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): తోట చంద్రయ్య హత్యపై సీఐడీ విచారణకు ఆదేశించడంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, హోంశాఖా మంత్రి వంగలపూడి అనితకు మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బ్రహ్మానందరెడ్డి మాట్లాడారు. వెల్దుర్తి మండలం గుండ్లపాడుకు చెందిన తోట చంద్రయ్య రెండెకరాల రైతు అని, తెలుగుదేశం పార్టీపై అభిమానం, అన్న ఎన్టీఆర్ పట్ల మమకారంతో పనిచేసే వాడని, అటువంటి చంద్రయ్యను ముక్కోటి ఏకాదశి రోజున పట్ట పగలు అందరూ చూస్తుండగా గ్రామంలోని నడి రోడ్డుపై అత్యంత పాశావికంగా గొంతు కోసి హతమార్చారని స్పీకరు రఘురామకృష్ణరాజు దృష్టికి తెచ్చారు. జై జగన్ అంటే చంపకుండా వదిలిపెడతామని ప్రత్యర్థులు బెదిరించినా జైచంద్రబాబు అంటూ ప్రాణాలు విడిచిన కార్యకర్త అని తెలిపారు. వైసీపీ పరిపాలన చంబల్‌లోయను మించి తాలిబన్ రాజ్యంను తలపించిందన్నారు. అప్పట్లో పల్నాడులో బాధితుడు పోలీస్‌స్టేషన్‌కు వెళ్తే ఫిర్యాది ముద్దాయి అవుతాడు.. ముద్దాయి ఫిర్యాదిదారు అవుతారని ఇంతకంటే దౌర్భాగ్యం రాష్ట్ర చరిత్రలోనే కాదు దేశ చరిత్రలో మరెక్కడా ఉండదన్నారు. తనకు మొట్టమొదటిసారి శాసనసభలో మాట్లాడే అవకాశం కల్పించినందుకు స్పీకరు రఘురామకృష్ణరాజుకు ధన్యవాదాలు తెలిపారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్వీఆర్‌జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు




ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

గుంటూరు(విద్య),మార్చి 11(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరంలోని ఆర్వీఆర్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో జిందాల్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 6 గురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కళాశాల అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు 6.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు సాధించారన్నారు. బీటెక్ చివరి సంవత్సరం చదువుతున్న కెమికల్ ఇంజనీరింగ్ విద్యార్థిని కె. చాందిని, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విద్యార్థి ఎమ్. వివేక్, మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థులు గుంటి పీటర్ పాల్, ఎమ్. అజయ్ శ్రీకృష్ణ, వర్ధన కె, వై. శ్యామ్ కుమార్ ఉద్యోగాలు సాధించారని తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, అకడమిక్ అండ్ ఆర్‌అండ్‌డీ డైరెక్టర్ డాక్టర్ .కె.రవీంద్ర, డైరెక్టర్ ఫైనాన్స్‌అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్.వి.శ్రీనివాసరావు, ప్లేస్మెంట్ ఆఫీసర్స్ సి.హెచ్. శ్రీనివాసరావు, డాక్టర్ .కె.సురేష్ బాబు తదితరులు అభినందించారు.

## అమెరికాలో ఇంటర్న్‌షిప్‌కు విజ్ఞాన్ ఫార్మసీ విద్యార్థులు

గుంటూరు(విద్య),మార్చి 11( ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ అడ్వాన్స్డ్ ఫార్మసీ హాస్పిటల్స్‌లో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని కళాశాల



విద్యార్థులను అభినందిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

ప్రిన్సిపాల్ శ్రీనివాసబాబు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో ఫార్మాడీకు చెందిన 6వ సంవత్సరం విద్యార్థులు ఎస్‌కే. దెహనాజ్, ముషీర అనే ఇద్దరు విద్యార్థులు అమెరికాలోని ప్రముఖ హాస్పిటల్స్‌లలో 4 వారాల అడ్వాన్స్డ్ ఫార్మసీ ప్రాక్టీస్ ఎక్స్‌పెరిమెంటల్ ట్రైనింగ్ ఇంటర్న్‌షిప్‌కు ఎంపికయ్యారని తెలియజేసారు. టెన్నెస్సెలోని నాష్‌విల్లేలో అమెరికన్ ఫార్మా సిస్ట్ అసోసియేషన్ ఆన్యుల్ కన్వెషన్, ఓహియోలోని యూ నివర్సిటీ ఆఫ్ ఫిండ్లేలో జరగనున్న ఫార్మాడీ సింపోసిజమ్ ఫర్ స్కాలర్‌షిప్ అండ్ క్రియేటివిటీ కాన్ఫరెన్స్‌లో రెండు రీసెర్చ్ పేపర్లు ప్రచురించ డానికి వీరికి అనుమతి లభిం చిందని వెల్లడించారు. విద్యా ర్థులను విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, విజ్ఞాన్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పీ శ్రీనివాసబాబు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు అభినందించారు.

**నెక్ సూచించిన కోడిగుడ్ల ధర**

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

**బ్రాయిలర్ ధరలు**

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

| | |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 91, 99, 110 |
| చికెన్ విత్ స్కిన్ | 176.00 |
| చికెన్ స్కిన్ లెస్ | 186.00 |

## 1,44,323 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,38,953 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,44,323 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 69,551 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| నాన్ ఏసీ కామన్ వెరైటీ | | |
| 334 | 9500 | 13800 |
| నంబరు. 5 | 10000 | 14000 |
| 273 | 10000 | 13000 |
| 341 | 10500 | 14500 |
| 4884 | -- | -- |
| సూపర్ 10 | -- | -- |
| నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ | | |
| తేజ | 10500 | 14000 |

| వెరైటీ | కనిష్ఠధర | గరిష్ఠధర |
|---|---|---|
| షార్క్-1 | 11000 | 12500 |
| బ్యాడిగి 355 | 10000 | 14000 |
| సింజెంటా బ్యాడిగి 5531 | 10500 | 12200 |
| దేవనూరు డీలక్స్ | 11500 | 13500 |
| ఆర్మూరు | 10000 | 11200 |
| తాలుకాయలు | 5000 | 7500 |

## ఇళ్ళు నిర్మించుకునే వారు దరఖాస్తు చేసుకోండి

రాజుపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సొంత స్థలం ఉండి ఇళ్ళు నిర్మించుకునేవారి కోసం ఎన్టీఆర్ పీఎం హౌసింగ్ స్కీం ఇవ్వనున్నట్లు హౌసింగ్ ఏఈ జోషి తెలియజేశారు. మంగళవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లా డుతూ లబ్ధిదారులకు రూ.2,50000 ఇస్తారన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు అదనపు సాయం కింద ఇస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు.

### నకరికల్లు మండలంలో..

నకరికల్లు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కొత్తగా గృహాలు నిర్మించుకొనేందుకు మండలంలో 3,813 గృహాల నిర్మాణాలకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు హౌసింగ్ ఏఈ రాములునాయక్ తెలిపారు.

## నేడు సర్వసభ్య సమావేశం

మాచవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంగళరావు మంగళవారం తెలిపారు. ఎంపీపీ దారం అంబులమ్మ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలపరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తగు సమాచారంతో హాజరుకావాలని కోరారు.

## ఇసుక అక్రమ లోడింగ్



అత్తలూరులో లారీలకు లోడింగ్ చేసేందుకు సిద్ధం చేసిన ఇసుక

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని మల్లాది ఇసుక రీచ్ నుంచి ట్రాక్టర్ల ద్వారా సొంత అవసరాలకని కొందరు ఇసుకను తీసుకువచ్చి అత్తలూరులో నిల్వ చేసి దానిని రాత్రి వేళల్లో నిత్యం లారీలకు అక్రమంగా లోడింగ్ చేస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు. మల్లాదిలో ట్రాక్టర్ రూ.600కు ఇసుకను లోడింగ్ చేయించుకుని అత్తలూరుకు రూ.1100 అన్‌లోడింగ్ చేయడం దానిని లారీలకు లోడింగ్ చేస్తున్నట్లు తెలుస్తుంది. మల్లాది రీచ్‌లో లారీలకు లోడింగ్ చేయకపోవడంతో లారీ యజమానులు అత్తలూరులో రాత్రి సమయాల్లో అక్రమంగా లోడింగ్ చేయించుకుని ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.

## జడ్పీహెచ్‌ఎస్‌ను సందర్శించిన కోఆర్డినేటర్ సుబ్బారావు

దుర్గి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను మంగళవారం జిల్లా సర్వశిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సుబ్బారావు సందర్శించారు. పీఎం శ్రీ కేంద్ర ప్రభుత్వ పథకం అమల్లో భాగంగా పాఠశాలలో రన్నింగ్ ట్రాక్, పదో తరగతి విద్యార్థుల ప్రగతి తదితర అంశాలపై హెచ్ఎం కోటేశ్వరమ్మను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో బెంజిమెన్, అనంతరామయ్య, భారతి ఫ్లోరెన్స్ పద్మ, లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

## సారా నిర్మూలనపై అవగాహన

అచ్చంపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : సారా తాగటం వల్ల ప్రజలు రోగాల భారిన పడతారని, పల్నాడు జిల్లా స్క్వాడ్ సీఐ శ్రీనివాసమూర్తి అన్నారు. మంగళవారం మండలంలోని తాడువాయిలో సారా నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. సారా తాగే వారిలో వచ్చే వ్యాధులు, కుటుంబాల్లో వచ్చే ఇబ్బందులు తదితర వాటి గురించి శ్రీనివాసమూర్తి వివరించారు. ఈ సందర్భంగా తాడువాయిలో సారా అమ్ముతున్న భూక్యా హనుమంతునాయక్, ఆదిలక్ష్మి, ఎం వెంకటరమణలపై బైండోవర్ నమోదు చేశారు. కార్యక్రమంలో క్రోసూరు ఎక్సైజ్ సీఐ తులసీ, సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్‌వాడీల పక్షపాతి కూటమి ప్రభుత్వం

పెదకూరపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల పక్షపాతి కూటమి ప్రభుత్వమని టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ ముంతాజ్, తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొల్లి లక్ష్మీనరసమ్మ అన్నారు. పెదకూరపాడులో ముంతాజ్ గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మినీ అంగన్‌వాడీలను కేంద్రాలుగా మార్పు చేయటంతో పాటు దహన సంస్కారాలకు 15వేల రూపాయలను ప్రకటించి జీవో విడుదల చేసిందని, ప్రతి నెల 1వ తేదీన క్రమం తప్పకుండా అంగన్‌వాడీలకు జీతాలు వేస్తున్నారన్నారు. వేతనాలు పెంపుదలను కూడా కూటమి ప్రభుత్వం పరిశీలిస్తామని ఆ శాఖ మంత్రి హామీ ఇచ్చారని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తగు న్యాయం చేస్తారన్నారు. సమావేశంలో ట్రేడు యూనియన్ నేతలు సామ్రాజ్యం, కుమారిలు ఉన్నారు.

## యువత జీవితాలను నాశనం చేసిన మాజీ సీఎం జగన్‌రెడ్డి

### తెలుగుయువత అధ్యక్షుడు రాఘవరావు

రాజుపాలెం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): 2019 నుంచి 2024 వరకు అధికారంలో ఉండి యువత భవిష్యత్తును పట్టించుకోకుండా వారి జీవితాలను నాశనం చేసిన జగన్‌రెడ్డి నేడు యువత పోరు అనే కొత్త నాటకానికి తెరతీయటం సిగ్గుచేటని తెలుగుయువత నియోజకవర్గ అధ్యక్షుడు చిన్నబోయిన రాఘవరావుయాదవ్ మండిపడ్డారు. మంగళవారం మండలంలోని అనుపాలెంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాఘవరావుయాదవ్ మాట్లాడుతూ పరీక్షల సమయంలో ఇలాంటి కార్యక్రమాలు పెట్టి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.2,832 కోట్లు, వసతి దీవెన రూ.989 కోట్లు, పీజీ ఫీజు రియింబర్స్‌మెంట్ రూ.500 కోట్లు బకాయిలు పెట్టి నేడు పోరాటం అనడానికి సిగ్గులేదా అని ప్రశ్నించారు.

# అందినకాడికి దోచేశారు

- చనిపోయిన వ్యక్తుల పేరిట మస్టర్లు
- వలంటీర్లు, ఆశావర్కర్లు సైతం ఉపాధికూలీలే
- కనిపించని మొక్కలు.. రూ.లక్షలు చెల్లింపులు
- నిగ్గుతేల్చిన సోషల్ ఆడిట్ బృందాలు



ప్రజావేదిక నిర్వహిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

వెల్దుర్తి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ పథకం వారికి వరంలా మారింది. పనిచేయకుండా నే చేసినట్లు చూపడం, మొక్కలు లేకుండానే నాటినట్లు దండుకోవడం, వలంటీర్లు, ఆశావర్కర్లు కూడా ఉపాధి కూలీలే, ఆఖరికి చనిపోయిన వారి పేరు మీద కూడా మస్టర్లు వేసి ఇలా ప్రభుత్వ సొమ్మును లక్షల్లో దండుకోవడం ఒక్క ఉపాధిహామీలోనే సాధ్యమైంది. సోషల్ ఆడిట్ బృందాలు తనిఖీల్లో అవినీతి బాగోతం బయటపడింది. వివరాల్లోకి వెళ్తే...

వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ (ప్రజావేదిక) అధికారులు నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో జరిగిన 536 పనులకు ఖర్చు చేసిన రూ.9,89,06,068 నిధులపై పదిరోజులుగా ఆడిట్ బృందాలు పరిశీలించి గ్రామసభల అనంతరం ప్రజావేదికలో నివేదికలను చదివి వినిపించారు. ఈ ఆడిట్‌లో విస్తుపోయే నిజాలను సోషల్ ఆడిట్ బృందాలు వెలికితీశాయి. చనిపోయిన వ్యక్తుల మీద మస్టర్లు వేసి నిధులు స్వాహా చేయడం, వలంటీర్లు, ఆశావర్కర్లు సైతం ఉపాధి పనులకు వచ్చినట్లు దోపిడికి పాల్పడ్డారు. హార్టికల్చర్‌లో రైతులకు అందించిన ఫలసాయం మొక్కలకు లక్షలాది రూపాయలు చెల్లింపులు జరిగినప్పటికీ అక్కడ ఆ మొక్కలు లేకపోవడం గుర్తించారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్లు జాబ్‌కార్డులు అప్‌లోడ్ చేయకపోవడం, మాన్యువల్ రికార్డులు ఆడిట్ బృందాలకు అప్పజెప్పలేదు. అలాగే గ్రామసభలను పర్యవేక్షించాల్సిన అబ్జర్వర్లు దాదాపుగా గ్రామసభలకు గైర్హాజరయ్యారని ఆడిట్ బృందం సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై క్షేత్రస్థాయిలో మరలా పరిశీలించాలని మండల అధికారులను పీడీ సిద్ధ లింగమూర్తి ఆదేశించారు.

### చనిపోయిన వారి పేరుపై మస్టర్లు..

మండలంలోని ఉప్పలపాడుకు చెందిన గురవయ్య 2016లో చనిపోయాడు. అయితే అతను ఉపాధికూలీకి వచ్చినట్లు నిధులు స్వాహా చేశారు. అలాగే అదే గ్రామానికి చెందిన వలంటీరు శ్రీను ఉపాధి పనికి వచ్చినట్లు మస్టర్లు వేయించుకొని నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. అలాగే గంగలకుంటలో వలంటీరు నాగార్జున రూ.2055, ఆశావర్కర్ సువర్ణలత రూ.6750లు కూలీ రూపంలో చెల్లించినట్లు సమావేశం దృష్టికి తెచ్చారు. అలాగే మరికొందరు కూడా ఈ విధంగానే నిధులు స్వాహా చేసినట్లు గుర్తించారు. అదేగ్రామంలో కొందరు రైతులకు హార్టికల్చర్ ద్వారా మొక్కలు పంపిణీ చేశారు. సుమారు రూ.70 వేల వరకు బిల్లులు చెల్లించారు. అయితే అక్కడ మొక్కలు లేకపోవడంతో అధికారుల బృందాలు అవాక్కయ్యాయి. అలాగే కొన్ని గ్రామాల్లో పని ప్రదేశాల్లో చెక్ మెజర్‌మెంట్స్ వ్యత్యాసాలను గుర్తించారు. అదే గ్రామానికి చెందిన ముగ్గురు వలంటీర్లను ఉపాధికూలీలుగా చూపి నగదు చెల్లింపులు జరిపారు.

### నిధులు దుర్వినియోగం..

అలాగే కొన్ని గ్రామాల్లో సంతకం లేకుండానే కూలీలకు చెల్లింపులు జరిపారు. మరికొన్నిచోట్ల పనికి రాకుండానే మస్టర్లు వేశారు. అలాగే గొట్టిపాళ్లలో కూడా సంతకాలు లేకుండా పనికి రాకుండా నిధులు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. అదే గ్రామంలో జామ మొక్కలను వేసినట్లు రికార్డుల్లో కనిపిస్తున్నాయి క్షేత్రస్థాయిలో కనిపించకపోవడాన్ని గుర్తించారు. అదే గ్రామానికి చెందిన నాగులుబాయి జామ మొక్కలను నాటారు. మొక్కలు ఏపుగా ఉన్నప్పటికీ బిల్లు చెల్లింపులు జరగకపోవడాన్ని ఆడిట్ బృందాలు గుర్తించాయి. మొక్కలు లేనిచోట్ల చెల్లింపులు జరిపి, మొక్కలు బాగా ఉన్నచోట్ల చెల్లింపులు జరపకపోవడంపై పీడీ సిద్ధ లింగమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో ఆమెకు బిల్లులు చెల్లించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కొత్తపుల్లారెడ్డిగూడెంకు చెందిన రామ్‌చంద్రనాయక్ తనకు ఐదేళ్లుగా ఉపాధిహామీ జాబ్ కార్డు లేదని పీడీ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే అప్పటికప్పుడే జాబ్‌కార్డు అందించారు. ఈ ప్రజావేదికలో ఏపీడీ మల్లికార్జున, ఎంపీడీవో ప్రసాద్, ఎస్ఆర్‌పీ లోకేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

### నిధులు కక్కిస్తారా.. కప్పిపుచ్చుతారా..!

ప్రజావేదికలో గుర్తించిన అవకతవకలు, నిధులు దుర్వినియోగంపై బాధ్యుల నుంచి కక్కిస్తారా.. కప్పిపుచ్చుతారా అనేది వేచిచూడాలి. గ్రామసభలు, ప్రజావేదికల్లో గుర్తించిన అవకతవకలపై సిబ్బందిపై పెద్దగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ప్రతి ప్రజావేదికలో వీరి అక్రమాలు బయటపడుతూనే ఉన్నాయి. ఉన్నతాధికారుల వద్దకు పోగానే వాటిని కప్పిపుచ్చడం షరామామూలైంది. ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## తిరునాళ్లను విజయవంతం చేద్దాం : ఆర్డీవో మురళి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మురళీకృష్ణ

దుర్గి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండల అధికారులంతా సమన్వయంతో పనిచేసి ఈ నెల 23వ తేదీన జరగనున్న అడిగొప్పుల నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి తిరునాళ్లను విజయవంతం చేయాలని గురజాల ఆర్డీవో మురళీకృష్ణ అన్నారు. మంగళవారం శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో తిరునాళ్లకు సంబంధించిన సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీవో మురళీకృష్ణ మాట్లాడుతూ సుమారు లక్ష మందికి పైగా భక్తుల రద్దీ ఉంటుందని, గతంలోలా పొరపాట్లు జరగకుండా అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పనిచేయాలన్నారు. మెడికల్ క్యాంపు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేయాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు బందోబస్తు నిర్వహించాలన్నారు. భక్తుల రాకపోకల కోసం ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ముందుగా తహసీల్దార్ ఫణీంద్రకుమార్‌తో కలిసి ఆర్డీవో అమ్మవారిని దర్శించుకున్నారు. మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాచర్లటౌన్ సీఐ ప్రభాకరరావు, ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సైదమ్మబాయి, దేవాలయ వ్యవస్థాపక ధర్మకర్త యాగంటి వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శివప్రసాద్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, వలపా పెద సైదులు, హనుమంతురావు, అఫీజ్, జక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సర్వే చేయాలా.. వైద్య సేవలందించాలా..!

- పని ఒత్తిడిలో ఏఎన్ఎంలు

గురజాలటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : ముందు నుయ్యి.. వెనుక గొయ్యి అన్నట్టుగా తయారైంది ఏఎన్ఎంల పరిస్థితి.. హౌస్ మ్యాపింగ్, పీ4 సర్వే చేయాలంటూ పంచాయతీ అధికారులు పట్టుబడుతుండగా వైద్య సేవలందించాలందిస్తూ ఎన్‌సీడీ సర్వే చేయాలంటూ వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. తమ సర్వే ముందుచేయాలంటే తమది ముందు చేయాలంటూ అధికారులు ఒత్తిడి తెస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి 10 గంటల వరకు కూడా ఏఎన్ఎంలు గృహాల చుట్టూ తిరుగుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఎన్‌సీడీసీడీ సర్వేలో వైద్యాధికారులు టార్గెట్లు ఇస్తుండడంతో రాత్రుళ్లు సైతం విధి నిర్వహణలో ఉంటున్నారు. వ్యవసాయ పనులు కావడం, ఉద్యోగ, ఉపాధి రీత్యా పలువురు గృహాల్లో ఉండకపోవడంతో వారొచ్చే వరకు గృహాల వద్ద వేచి ఉంటూ రాత్రుళ్లు కూడా పనిచేయాల్సి వస్తోందని ఏఎన్ఎంలు వాపోతున్నారు. ఇంత కష్టపడినా సరైన గౌరవం కూడా అందడం లేదు. సర్వే చేస్తేనే జీతాలు చెల్లిస్తామని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. సర్వే చేయకుంటే మెమోలు జారీ చేస్తామని వైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి సర్వర్లు మొరాయిస్తుండడంతో సర్వేలు ముందుకు సాగడం లేదు. ఇలా పని ఒత్తిడి, అధికారుల ఆదేశాలతో అల్లాడిపోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పేదల అభ్యున్నతికి కృషి చేసిన మందపాటికి నివాళి



ఇరికేపల్లిలో మందపాటి నాగిరెడ్డి స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

దాచేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పని చేసిన దివంగత నేత మందపాటి నాగిరెడ్డి పేదల అభ్యున్నతికి కృషి చేశారని, పల్నాడు జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్ అన్నారు. మంగళవారం దాచేపల్లి నగర పంచాయతీ ఇరికేపల్లి గ్రామంలోని మందపాటి నాగిరెడ్డి స్థూపం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మందపాటి నాగిరెడ్డి 20వ వర్ధంతి సభలో మాట్లాడుతూ తొలుత అరుణ పతాకాన్ని సీనియర్ మహిళా నాయకురాలు బుర్రి ఝాన్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ 13 సంవత్సరాలు గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేగా పని చేసిన మందపాటి నాగిరెడ్డి పేదలకు నివేశ స్థలాలు, మార్కెట్ యార్డులు నిర్మించారు. నడికూడి - బీబీ నగర్ రైలు మార్గం, నాగార్జున సాగర్ నిర్మాణానికి ఎనలేని కృషి చేశారన్నారు. పల్నాడు ప్రాంతంలో కళాశాలలు, పాఠశాలల నిర్మాణానికి శ్రమించారన్నారు. కార్యక్రమంలో మందపాటి రమణారెడ్డి, తెలనాకుల సత్యనారాయణ, ఎం శరవయ్య, షేక్ గాలీషా, భాస్కర్, శ్రీరాములు, పత్తిపాటి వెంకట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తపై చర్య తీసుకోవాలి



జిల్లా వైద్యాధికారి బీ రవికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్న ఉంగుటూరు గ్రామస్థులు

అమరావతి, మార్చి 11(ఆంధ్రజ్యోతి) తమ గ్రామంలో విధులు నిర్వహించ కుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఆశా కార్యకర్త రాయపాటి సామ్రాజ్యంను విధుల నుంచి తొలగించాలని మండలపరిధిలోని ఉంగుటూరు గ్రామానికి చెందిన సర్పంచ్ అనూరాధతో సహా 70మంది జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ బి రవికి పిర్యాదు చేశారు. గతంలో జిల్లా అధికారులకు ఆశా కార్యకర్తపై ఇచ్చిన పిర్యాదుపై జిల్లా వైద్యశాఖ అధికారి మంగళవారం అత్తలూరు ప్రాథమిక వైద్య కేంద్రంలో విచారణ చేపట్టారు. గ్రామస్థులు లిఖిత పూర్వకంగా ఆశా కార్యకర్త గతంలో చేసిన అక్రమాలపై పిర్యాదు చేశారు. తరువాత ఆశా కార్యకర్త సామ్రాజ్యం కూడా లిఖిత పూర్వకంగా తన పిర్యాదును జిల్లా వైద్యాధికారి రవికి ఇచ్చేందుకు వచ్చి తన సంచిలో నుంచి పురుగుమందు డబ్బాను తీసి తాగబోయింది. పక్కనే ఉన్న వైద్యసిబ్బంది డబ్బాను తీసేశారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకుంది. తరువాత వైద్యాధికారి సామ్రాజ్యంతో మాట్లా డారు. ఇద్దరు ఇచ్చిన పిర్యాదులను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

## నేడు భారీ ఆంజనేయ స్వామి విగ్రహావిష్కరణ

కోసూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : క్రోసూరులోని చెరువు కట్టపై నిర్మించిన 33 అడుగుల భారీ అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించనున్నట్లు విగ్రహ నిర్మాణ ప్రధాన దాత కాంద్రు కాశయ్య తెలియ జేశారు. తాళ్ళాయపాలెం శైవ క్షేత్ర పీఠాధిపతి శివస్వామి చేతుల మీదుగా ఆవిష్కరిస్తారన్నారు. దీనికి సంబంధించిన అకురార్పణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## అక్రమ విద్యుత్ వినియోగిస్తే శిక్ష తప్పదు

- విద్యుత్‌శాఖ ఎస్ఈ విజయకుమార్

మాచవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని విద్యుత్‌శాఖ ఎస్ఈ బీ విజయకుమార్ స్పష్టం చేశారు. మంగళవారం మండలంలోని చెన్నాయపాలెం, పిన్నెల్లి, మోర్జంపాడు, మాచవరం గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్‌లను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు చేశారు. రైతులకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నారా? లేదా? సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సింగరాయపాలెం తండాలో ఏర్పాటు చేసిన విద్యుత్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో గతంలో ఉన్న పాత బకాయిలు కూడా చెల్లించాలని, ప్రతి ఒక్కరు మీటరు ఏర్పాటు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో రెండు వందల యూనిట్ల వరకు ఉచిత కరెంటు ఇస్తామని, ప్రతి ఒక్కరు మీటరు ఏర్పాటు చేసుకొని ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాచర్ల డీఈ ఎన్ సింగయ్య, దాచేపల్లి ఏడీఈ వీరేశ్వరరావు, మాచవరం ఏఈ భగవాన్‌నాయక్, లైన్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## పాపాయపాలెంలో ప్రజాభిప్రాయ సేకరణ

బెల్లంకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపాలెంలో రాధాకృష్ణ మినరల్స్ క్వారీకి సంబంధించిన అభ్యంతరాలపై ప్రజాభిప్రాయ సేకరణను మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి డీఆర్వో మురళీ, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్వో మురళీ మాట్లాడుతూ పాపాయపాలెంలో రాధాకృష్ణ మినరల్స్‌కు సంబందించిన మైనింగ్ కోసం 6.47 ఎకరాల్లో సర్వే నెంబరు 338/7, 338/74, 338/75, 338/76, 338/77, 338/78 2,618 హెక్టార్లలో మైనింగ్, లీజు కోసం పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు డీఆర్వో తెలిపారు. గ్రామస్థుల దగ్గర నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వెంటనే అధికారులకు తెలియపరచాలని సూచించారు. పాపాయపాలెం గ్రామ స్థులు రాధాకృష్ణ మినరల్స్ ఏర్పాటు చేయటానికి ఎటువంటి అభ్యంతరాలు లేవని, తమ గ్రామంలో చదువుకొని ఉన్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించాలని కోరారు. మినరల్స్ కార్యక్రమం చేపట్టిన తరువాత పర్యావరణాన్ని పరిరక్షించాల్సినటువంటి చర్యలు కూడా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పాటు ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ అస్రిఫున్నీసా బేగం, ఏపీ పొల్యూషన్ బోర్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కార్యకర్త మృతిపై వైసీపీ రాజకీయం

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి

నకరికల్లు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాపిశెట్టిపాలెంలో అంగన్‌వాడీ కార్యకర్త షేక్ దూదేకుల ఫాతిమాబేగం మృతిపై వైసీపీ నేతలు రాజకీయం చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కనుమూరి బాజీ చౌదరి ఆరోపించారు. ఫాతిమా బేగం వ్యక్తిగత సమస్యలతో మృతి చెందిందని, ఆమె మృతిపై వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలు మానుకోవాలని బాజీ చౌదరి అన్నారు. వైసీపీ శవ రాజకీయాలు మానుకోవాలని కోరారు.

## పరిసరాల శుభ్రతతోనే బోదకాలు నివారణ

దాచేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రతతోనే బోదకాలు నివారణకు సాధ్య పడుతుందని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సుచరిత తెలిపారు. మంగళవారం జాతీయ బోదకాలు, వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా మండలంలో తంగెడ, కేసానుపల్లి, గామాలపాడు, పొందుగుల గ్రామాల్లో బోదకాల వ్యాధిగ్రస్తులకు మెడికల్ కిట్లు, డీఈసీ మాత్రలు పంపిణీ చేశారు. బోదకాలకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉన్న తంగెడలో 70 మంది వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. వ్యాధి ఉన్నట్టు అనుమానంగా ఉన్నట్లయితే మొదటి దశలోనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి చికిత్స పొందాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎంఎల్ఎస్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు

దాచేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసానుపల్లిలో పారిశుధ్య పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి స్వామి నాయక్ పర్యవేక్షణలో గ్రామ సర్పంచ్ బాబు, ఎంపీటీసీ ఏసుదానం, ఈవోపీఆర్డీ గుప్తా పారిశుధ్య పనులను పర్యవేక్షించారు. గ్రామ ప్రజలు నెల్లూరి రామ కోటయ్య, కోట శాయన్న తదితరులు పంచాయతీ సిబ్బందికి తమ వంతుగా అండదండలు అందజేశారు.

### ముప్పాళ్ళ మండలంలో..

ముప్పాళ్ళ, మార్చి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదలలో పంచాయతీ, వైద్యశాఖల ఆధ్వర్యంలో పారిశుధ్య పనులను మంగళవారం చేపట్టారు. గ్రామంలో సైడుకాల్వలలో పూడిక తీసి బ్లీచింగ్ చల్లారు. గ్రామానికి చెందిన మహిళ గుంటూరు జీజీహెచ్‌లో జీబీఎస్ వ్యాధి లక్షణాలతో మృతి చెందినట్లు కథనాలు రావడంతో అధికారులు అప్రమత్తమై గ్రామంలో పారిశు ధ్య పనులను చేపట్టారు. సాయంత్రం దోమల మందును ఫాగింగ్ చేశారు. గ్రామంలో జ్వరాలు లేవని డాక్టర్ రమాదేవి తెలిపారు.

## పాఠశాల విద్య బాగుంటేనే సమాజం బాగుంటుంది

- ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అసెంబ్లీ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పెదకూరపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్య బాగుంటేనే ఉన్నతమైన విలువలతో సమాజం బాగుంటుందని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ పాఠశాల విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో రూ.31వేల కోట్లను కేటాయించిందని, ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూల్స్‌కు దీటుగా అభివృద్ధి చేసేందు కు కృషి చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పి దాల వల్ల మిషనరీ స్కూల్ వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, ఆ పాఠశాలలకు పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేయాలని కోరారు. వంద మంది విద్యార్థులు చదువుకొనేందుకు నిర్మించిన పాఠశాలలు నిరుపయోగంగా మారాయని, వాటిని పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కోరారు.

## ఉపాధిహామీ పనులు పరిశీలించిన పీడీ సిద్ధలింగమూర్తి



ఉపాధిహామీ పనులను పరిశీలిస్తున్న పీడీ సిద్ధలింగమూర్తి

దుర్గి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని ఉపాధి హామీ పనులను మంగళవారం పీడీ సిద్ధ లింగ మూర్తి పరిశీలించారు. గ్రామంలోని ఫారంపాండ్ పనులను పరిశీలించారు. ప్రధానంగా మస్టర్ వెరిఫికేషన్, వర్క్ సైట్ ఫెసిలిటీస్ కింద ఫస్ట్ ఎయిడ్ బాక్సు, నీడ, కూలీలకు కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. పీడీ వెంట ఎంపీడీవో శివప్రసాద్, గురజాల క్లస్టర్ ఏపీడీ మల్లికార్జునరావు, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ ప్రభాకర్, అసిస్టెంట్ విజిలెన్స్ ఆఫీసర్ విజయ, ఏపీవో చిన వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పాఠశాలలను పరిశీలించిన ఎంఈవో సాంబశివరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



గడ్డకట్టిన సిమెంట్ బస్తాలను పరిశీలిస్తున్న ఎంఈవో సాంబశివరావు

గురజాలటౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు నిధులు నిరుపయోగం పై మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'నిధులు నిరుపయోగం' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంఈవో సాంబశివరావు పట్టణంలోని బుడగజంగాల కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గడ్డకట్టిన సిమెంట్ బస్తాలను పరిశీలించారు. సిమెంట్ బస్తాలు ఎప్పుడు వచ్చాయి.. ఎందుకు గడ్డకట్టాయి అని హెచ్ఎం విజయకుమారిని అడిగి తెలుసుకున్నారు.

## వేసవిలో దుక్కులు లోతుగా వేసుకోవాలి : ఏడీఏ

మాచవరం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవి కాలంలో పంటలు అయిపోయిన తరువాత రైతులు పొలాల్లో దుక్కులు లోతుగా వేసుకోవాలని ఏడీఏ శ్రీకృష్ణ దేవరాయలు సూచించారు. మంగళవారం మండలంలోని చెన్నాయపాలెంలో వ్యవసాయశాఖ వారి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ శ్రీ కృష్ణదేవరాయలు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ వివిధ పంటల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు. వేసవి కాలంలో దుక్కులు లోతుగా వేసుకోవాలని తెలిపారు. 50 శాతం రాయితీపై పచ్చి రొట్ట ఎరువులు అందిస్తామన్నారు. దీనివల్ల భూసారం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రామమ్మ, పంచాయతీ కార్యదర్శి నాగ మల్లేశ్వరరావు, వీఆర్వో అఖిల్, వ్యవసాయశాఖ సిబ్బంది వంశీ, గోపీ, రైతులు పాల్గొన్నారు.

## నేడు తంగెడలో వైద్య శిబిరం

దాచేపల్లి, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తంగెడలో నరసరావుపేటకు చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి ఆస్పత్రి వారి సహకారంతో కంటి వైద్యశిబిరం బుధవారం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం తెలిపారు.

### బహిరంగ ప్రకటన

మా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, నరసరావుపేట బ్రాంచి వారి సూచనలు పొంది యుండుమూలముగా యావన్మందికి తెలియచేయునది ఏమనగా... సంపంగి వెంకటేష్ గారి భార్య వాణి గారి ఆస్తిని తనఖా పెట్టుకొని ఋణము పొందుటకు సంప్రదించినారు. కావున ఈ దిగువ షెడ్యూలు ఆస్తికి సంబంధించి ఎవరికైనా అభ్యంతరములు, క్లెయిములు ఉన్నచో 7 రోజులలోపు తెలియ చేయవలయును. ఎట్టి అభ్యంతరములు, క్లెయిములు రానిచో మా క్లయింట్ సదరు సంపంగి వెంకటేష్ గారికి ఋణం మంజూరు చేయును. షెడ్యూలు : ప్రకాశం జిల్లా, చీమకుర్తి స.రి. యిలాకా, చీమకుర్తి మండలం, బూదవాడ గ్రామ పంచాయితీ పరిధిలోని, బూదవాడ గ్రామ సర్వే నెం. 4/2 రు మాకు హక్కు గల య.5.69 సెంట్లు పూరా భూమిలో హద్దులు విడిన విక్రయాస్తి య.0.50 3/4 సెంట్లు కొరుమెట్టభూమికి హద్దులు. : తూర్పు : రాకపోకలకు మేము వదిలిపెట్టబడిన 40 అడుగుల వెడల్పు గల రోడ్డు దక్షిణం : ఈ రోజు మేము నూతలపాటి శ్రీహరిబాబు గారికి విక్రయించిన ఈ సర్వే నెంబర్లులోని య.0.50 3/4 సెంట్లు భూమి. పడమర : వాగు ఉత్తరం : గుజ్జుల కోటమ్మ గారి భూమి. ఈ హద్దులలోని విస్తీర్ణము య.0.50 3/4 సెంట్లు లేక 0.205 హెక్టార్లు భూమిన్నీ. DOC No: 1408/2012, SRO. చీమకుర్తి

లంకా విజయ్‌కుమార్, లంకా వంశీక్రిష్ణ, న్యాయవాదులు, 2వ లైను, రవీంద్ర నగర్, గుంటూరు. సెల్ నెం.9030595227, 9848052914

# సఖి నివాస్ సిద్ధం



తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్, ఫైర్ సేఫ్టీ సిలిండర్



కిచెన్ రూమ్



సఖి నివాస్..

- నిరీక్షణకు ఎట్టకేలకు తెర
- గత టీడీపీ ప్రభుత్వంలో మొదలైన పనులు
- ఎన్నికల నాటికి తుది దశకు చేరిన వైనం
- వైసీపీ రాకతో భవనానికి గ్రహణం
- కూటమి ప్రభుత్వం రాకతో జీవం..
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పని చేసుకునే మహిళలు, చదువుకునే విద్యార్థినులకు భద్రతతో కూడిన ఆశ్రయాన్ని కల్పించే 'సఖి నివాస్' భవనానికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. కేంద్ర ప్రాయోజిత పథకమైన 'మిషన్ సఖి' కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ సఖి నివాస్ మహిళలు, విద్యార్థినులకు అందుబాటులోకి రావడానికి దాదాపు ఏడేళ్ల సమయం పట్టింది. అందుకు కారణం గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకమే.

### 2019 నాటికే తుది దశకు నిర్మాణం

నగరాలు, పట్టణ ప్రాంతాల్లో ఉద్యోగాలు, ఉపాధి పొందే మహిళలకు చౌకగా భద్రతతో కూడిన ఆశ్రయం కల్పించడంలో భాగంగా కేంద్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ 'సఖి నివాస్'లను ఏర్పాటు చేయడానికి పూనుకుంది. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమం కావడంతో కేంద్రం 75 శాతం, రాష్ట్రం 25 శాతం వాటాలతో సఖి భవనాలను నిర్మిస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ హాస్టళ్లను నిర్మించి మహిళలకు అందుబాటులోకి తేవాలని అప్పట్లో టీడీపీ ప్రభుత్వం భావించింది. ఆ క్రమంలో గుంటూరు జిల్లాలో దాదాపు రెండున్నర కోట్ల వ్యయంతో మహిళా ప్రాంగణంలో ఈ హాస్టల్‌ను నిర్మించేందుకు పూనుకున్నారు. 2019 నాటికి నిర్మాణం తుది దశకు చేరింది. అయితే 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిం ది. హాస్టల్ నిర్మాణం పూర్తై అందుబాటులోకి వచ్చినా, మౌలిక సదుపాయాలు కల్పించి దాన్ని వినియోగంలోకి తేవడానికి గత ప్రభుత్వానికి మనసు రాలేదు. దీంతో ఐదేళ్లపాటు ఆలన, పాలన లేకుండా నిర్మాణం పడి ఉంది. తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొరవ పనులు పూర్తి చేశారు. త్వరలో హాస్టల్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.



డార్మెటరీ గదిలో పడకలు

### ● 90 మందికి ఆశ్రయం

ఉద్యోగినులు, పని చేసుకునే మహిళలు, విద్యార్థినులకు 24 గంటలపాటు భద్రత కల్పించే విధంగా హాస్టల్‌ను నిర్మించారు. మొత్తం 4 డార్మెటరీల్లో 90 మందికి ఆశ్రయం కల్పించే అవకాశం ఉండగా, తొలి విడతగా 50 మందికి నివాస ఏర్పాట్లు చేశారు. సింగిల్, డబుల్, ఐదుగురు సభ్యుల బెడ్‌రూమ్‌తోపాటు డార్మెటరీలు అందుబాటులో ఉన్నాయి. కేటగిరీ- 1 డార్మెటరీలో నాన్ ఏసీ గదులకు నెలకు రూ. 1200, ఏసీ గదులకు రూ.1,800, కేటగిరీ- 2 ఫైవ్ షేరింగ్ గదుల్లో నాన్ ఏసీ గదికి రూ.1,800, ఏసీ గదికి రూ.2,500 అద్దె ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు. సింగిల్, డబుల్ బెడ్‌రూమ్ అద్దెలు నిర్ణయించాల్సి ఉంది. అయితే ఇప్పటికే ఆ బెడ్ రూములు బుక్ అయిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. కాగా భోజనానికి సంబంధించి డ్వాక్రా గ్రూపులకు బాధ్యతలు అప్పగించారు. నాణ్యమైన, రుచికరమైన ఆహారాన్ని తక్కువ ధరకే అందించేలా ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

### సదుపాయాలు..

- విశాలమైన ప్రాంగణం, ఆహ్లాదకరమైన వాతావరణం, ఇంటర్నెట్, వైఫై సదుపాయాన్ని కల్పిస్తున్నారు.
- 24 గంటల నీటి సదుపాయం అందుబాటులో ఉంటుంది. తాగునీటి కోసం ప్రత్యేకంగా ఆర్వోమిషన్ ఏర్పాటు చేశారు.
- స్నానం చేసేందుకు వేడినీళ్ల సదుపాయం ఉంది. దుస్తులు ఉతుక్కోవడానికి వాషింగ్ మిషన్లు ఏర్పాటు చేశారు.
- రక్షణ కోసం సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.
- వ్యాహ్యాళి (రిక్రియేషన్) కోసం టీవీ ఏర్పాటు చేశారు. చదువుకునేందుకు, స్వయం ఉపాధి పనులు చేసుకునేవారికి ప్రత్యేకంగా ఒక హాల్ ఏర్పాటు చేస్తున్నారు.

రిక్రియేషన్ రూమ్



డైనింగ్ హాల్



# అవకతవకలపై.. అలసత్వం

(5వ పేజీ తరువాయి)

అద్దెకిచ్చిన దాఖలాలే లేవు. ఇలా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు విచారణలో వెల్లడైనట్లు సమాచారం. ఈ ఆడిట్ నివేదికలను బహిర్గతం చేయడంలో గోప్యత పాటించడంతో పాటు ప్రభుత్వానికి నివేదికలు సమర్పించడంలోనూ వ్యవసాయశాఖ తీరుపై విమర్శలు వస్తున్నాయి. ప్రజాధనాన్ని ఇష్టారీతిన వైసీపీ తన అనుయాయులకు దోచిపెట్టినా వారిపై చర్యల విషయంలో ఇప్పటికీ మీనమేషాలు లెక్కిస్తుండడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయితీ యంత్రాల యూనిట్ల విషయంలో జారీ చేసిన మార్గదర్శకాలలో ఒక్కటంటే ఒక్కటి కూడా అమలు చేయలేదు. సదరు యూనిట్ల కోసం కంపెనీలకు చెల్లించాల్సిన బకాయిలు కూడా ఇప్పటి ప్రభుత్వమే చెల్లించడం గమనార్హం.

### మార్గదర్శకాలకు తిలోదకాలు..

రైతులకు వ్యక్తిగతంగా రాయితీ యంత్రాలను 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం ఈ మార్గదర్శకాలకు తిలోదకాలిచ్చింది. గ్రూపులకు యంత్రపరికరాల యూనిట్లు ఇచ్చేలా వైసీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను జారీ చేసింది. అయితే రాయితీ పరికరాల జాబితా ట్రాక్టర్ లేకపోవడంపై రైతుల నుంచి వ్యతిరేకత వచ్చింది. దీంతో దానిని తిరిగి చేర్చారు. ఆ తర్వాత రాయితీ విషయంలో అస్పష్టత, యంత్రాలను అందించే కంపెనీల ఎంపికలో మార్పులు చోటుచేసుకున్నాయి. ఒక్కో యూనిట్‌కు రూ.5 లక్షల నుంచి 15 లక్షల యంత్రాలను అందించారు. ఇందులో 50 శాతం బ్యాంకు రుణం కాగా, 40 శాతం ప్రభుత్వమే రాయితీ ఇవ్వగా, మిగిలిన పది శాతం ఆయా గ్రూపు సభ్యులే భరించాలి. సదరు యూనిట్లను రైతు సేవా కేంద్రాలలో ఉంచి అవసరమైన రైతులకు నామమాత్రపు అద్దెకు ఇవ్వాలి. ఇందుకు ఎంతమంది రైతులు వాటిని వాడుకున్నారనే అంశంతో పాటు ఎప్పటికప్పుడు రికార్డులు కూడా నిర్వహించాలి. వసూలు చేసిన అద్దె విషయంలో కూడా పూర్తి పారదర్శకత ఉండాలన్నది నిబంధన విధించారు. మొత్తమ్మీద ప్రతిదశలోనూ అస్తవ్యస్తంగా ఈ ప్రక్రియను గత ప్రభుత్వం నడిపింది. చివరకు బాపట్ల జిల్లాలో 410 రైతు సేవా కేంద్రాల పరిధిలో 270 చోట్ల మాత్రమే యూనిట్లను మంజూరు చేసింది. గుంటూరు జిల్లాలో 249కు 205 చోట్ల, పల్నాడు జిల్లాలో 421 కేంద్రాలకు 290 కేంద్రాల్లో రాయితీపై యంత్రపరికరాల యూనిట్లకు పంపిణీ చేసింది. అయితే ఆయా యూనిట్లలో దాదాపు సగం చోట్ల ట్రాక్టర్లు లేకుండానే మమ అనిపించారు. కనీసం వీటి ఎంపిక అయినా పారదర్శకంగా జరిగిందంటే దాదాపు 50 శాతం యూనిట్లు సేద్యంతో ఏ మాత్రం సంబంధం లేని వైసీపీ నేతల అనుచరగణం వద్దనే ఉన్నాయి. రైతుసేవా కేంద్రాల వద్దే పరికరాలను ఉంచాలనే నిబంధనకు పాతరేసి సొంత ఆస్తిలాగా తమ ఇళ్ల వద్దే ఉంచుకున్నారు. చిన్న, సన్నకారు రైతులకు యంత్రాల అవసరమొస్తే వారి ఇళ్ల ముందు పడిగాపులు కాసే పరిస్థితి తీసుకొచ్చారు. రైతులపై కూడా పార్టీ ముద్ర వేసి రాయితీ యంత్రాల ఫలాలకు దూరం చేశారు.

గుండ్లకమ్మ - శ్రీకాళహస్తి రీజియన్‌ని

# ఆదాయవనరుగా మార్చుకోవాలి

● గుంటూరు డీఆర్ఎం రామకృష్ణ



రైల్వే వారోత్సవంలో షీల్డ్‌ని ప్రదానం చేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వే జోన్ ఏర్పాటుతో గుంటూరు రైల్వే డివిజన్ పరిధి తగ్గిపోతున్నది. ఈ నేపథ్యంలో లోడింగ్, ఆదాయంలో ఏర్పడబోయే లోటుని గుండ్లకమ్మ - శ్రీకాళహస్తి రీజియన్ ద్వారా పూడ్చుకోవాల్సి ఉందని రైల్వే గుంటూరు డివిజనల్ మేనేజర్ ఎం రామకృష్ణ అన్నారు. ఆ రీజియన్‌లో ఆదాయ వనరుగా మార్చుకోవాలని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో 69వ రైల్వే వారోత్సవం జరిగింది. ఈ సందర్భంగా డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ చెట్టినాడు సిమెంట్స్, శ్రీ సిమెంట్స్ సైడింగ్‌ల ద్వారా లోడింగ్‌లు పెంచుకోవాల్సి ఉందన్నారు. ఇందుకోసం రైల్వే ఉద్యోగులంతా కష్టపడి పని చేయాలని సూచించారు. అనంతరం జనరల్ మేనేజర్ స్థాయిలో మూడు అవార్డులు, రైల్వే బోర్డు స్థాయిలో ఒక అవార్డును సాధిం చినందుకు అధికారులు, సిబ్బందిని అభినందించారు. అవార్డులు పొందిన వారిలో వీ అలివేలు మంగమ్మబాయి(అకౌంట్స్), పీ శ్రీనివాస్, టీ బ్రహ్మ రెడ్డి, ఎం రాహుల్(సివిల్ ఇంజనీరింగ్), వేజండ్ల సరిత (కమర్షియల్), ఎస్ సోమునాయుడు(ఎలక్ట్రికల్ టీఆర్‌డీ), జీ రత్నం(ఎలక్ట్రికల్ మెయిన్‌టెనెన్స్), ఏ శ్రీనివాసరావు, బీమవరపు సాయిరాం(మెకానికల్), నంబూరి వెంకటేశ్వర రావు (మెడికల్), చిరబోయిన శ్రీనాథ్, లింగాబత్తుని సోనిబాబు (ఆపరేటింగ్), రెడ్డి శ్రీనివాసు(పర్సనల్), బోను వెంకటరమణ(సిగ్నలింగ్ అండ్ టెలీకమ్యూనికేషన్స్) ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం కే సైమన్, దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ సెక్రెటరీ వీ వీ రమణయ్య, సీనియర్ అధికారులు జేవీ అనూష, షాబాజ్ హనూర్, ప్రదీప్‌కుమార్, కమలాకర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## సీడీల విధానంలోనే ప్రశ్నపత్రాలు

### సమన్వయకర్త ఆచార్య సుబ్బారావు వెల్లడి

పెదకాకాని, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం బీఈడీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీని అరికట్టటానికి సీడీల విధానంలో ప్రశ్నపత్రాలను పరీక్ష కేంద్రాలకు అందించే నూతన విధానాన్ని ప్రవేశపెట్టామని పీజీ ప్రొఫెషనల్ కోర్సుల సమన్వయకర్త ఆచార్య ఎం. సుబ్బారావు మంగళవారం తెలిపారు. ప్రతిరోజు పరీక్ష ప్రారంభానికి అరగం ట ముందు పాస్వర్డ్‌ను పరీక్షా కేంద్రాల చీఫ్‌లకు పంపటం జరిగిందని చెప్పారు. పాస్వర్డ్ అందిన వెంటనే అభ్యర్థుల సమక్షంలో సీడీలను ఓపెన్ చేసి ప్రశ్నపత్రాలను ప్రింట్ తీయాల్సిందిగా పరీక్షల ప్రారంభానికి కొన్ని రోజులు ముందుగానే (సీడీలు అందచేసిన సమయంలోనే) పరీక్ష కేంద్రాల చీఫ్ లకు ఆదేశాలు ఇచ్చామని వివరించారు. ప్రశ్నపత్రాల ముద్రణ ఖర్చు తగ్గించుకోవాలనే దురుద్దేశంతో అనాలోచితంగా సీడీల విధానం తెచ్చారన టంలో వాస్తవం లేదని,అందుబాటులో ఉన్న సాంకేతికతను వినియోగిం చుకొని బీఈడీ పరీక్షల నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు సీడీలు విధానం తెచ్చామని ఆయన చెప్పారు.

### జన్మభూమి ఎక్స్‌ప్రెస్

## చర్లపల్లి నుంచే లింగంపల్లికి బైపాసు

గుంటూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నిత్యం లింగంపల్లిలో బయలుదేరి సికింద్రాబాద్, గుంటూరు మీదగా రాకపోకలు సాగిస్తున్న జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25వ తేదీ నుంచి చర్లపల్లి నుంచి లింగంపల్లికి బైపాసు కానుంది. ఈ మేరకు రైల్వేబోర్డు ఆమోదం తెలిపింది. నంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 25 నుంచి చర్లపల్లికి సాయంత్రం 6.05కి చేరుకొని 6.10కి బయలుదేరి బైపాసు మార్గంలో ప్రయాణించి నేరుగా రాత్రి 7.40కి లింగంపల్లి చేరుకొంటుంది. నంబరు. 12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 26వ తేదీ నుంచి లింగంపల్లిలో ఉదయం 6.15కు బయలుదేరి బైపాసు మార్గంలో 7.15కి చర్లపల్లికి చేరుకొని రెగ్యులర్ రూట్‌లో ప్రయాణిస్తుంది. ఈ రైలుకు సికింద్రాబాద్, బేగంపేట నిలుపుదలను ఎత్తేశారు. అలానే నంబరు. 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి, నంబరు. 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ ప్రత్యేక రైళ్లు కూడా సికింద్రాబాద్, బేగంపేట మార్గంలో కాకుండా చర్లపల్లి నుంచి నేరుగా లింగంపల్లికి చేరుకొంటాయి. ఈ మార్పులను ప్రయాణీకులు గమనించాలని రైల్వేబోర్డు విజ్ఞప్తి చేసింది.

### నెలాఖరు వరకు ధర్మవరం ఎక్స్‌ప్రెస్ అనంతపురం వరకే..

ధర్మవరం రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫాం పనుల నిమిత్తం నంబరు. 17215 మచిలీపట్నం - ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 12 నుంచి 30వ తేదీ వరకు అనంతపురం వరకే నడపడం జరుగుతుందని డీఆర్ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కారణంగా నంబరు. 17216 ధర్మవరం - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 31వ తేదీ వరకు ధర్మవరం నుంచి కాకుండా అనంతపురం నుంచి బయలుదేరి గుంటూరు మీదగా మచిలీపట్నం చేరుకొంటుందన్నారు. ఈ సవరణలను ప్రయాణీకులు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

# డ్రోన్లతో జూదరుల ఆటకట్టు

● పేకాట శిబిరాలపై పోలీసుల సాంకేతిక దాడి ● అదుపులో పదిమంది.. 10 వేల నగదు స్వాధీనం



డ్రోన్ కెమెరా ద్వారా గుర్తించిన పేకాట శిబిరం



పేకాట శిబిరం వద్ద ఎగురుతున్న డ్రోన్ కెమెరా



డ్రోన్ కెమెరాను గుర్తించి పరుగులు తీస్తున్న జూదరులు

చుండూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): పేకాట సమాచారం అందినా పోలీసులు అక్కడకు వెళ్లే సరికి వారు పారిపోతుంటారు. జూదరుల నెట్‌వర్క్ ముందు పోలీసుల శ్రమ వృథా అవుతుంది. ఈ పరిస్థితుల్లో ఎలాగైనా జూదరుల ఆట కట్టించాలనుకున్న చుండూరు పోలీసులు అందుబాటులోకి వచ్చిన నూతన సాంకేతికతను వినియోగిస్తున్నారు. డ్రోన్ కెమెరాల ను వినియోగించి జూద శిబిరాలను గుర్తించి అందిపుచ్చు కుంటోన్న జూదరుల ఆటకట్టిస్తోంది. మండల పరిధిలోని యడ్లపల్లి, దుండిపాలెంలోని నిమ్మతోటల్లోని పేకాట శిబిరాలు విస్తృతంగా ఉన్నాయి. పేకాట గురించి తెలిసినా పోలీసులు తోటల్లోకి బైక్‌లపై వెళ్లే అవకాశం లేదు. నడిచి వెళ్లాలంటే 40 నిమిషాలు సమయం పడుతుంది. కొత్త వారి కదలికలపై ప్రత్యేకంగా నిఘాకు మనుషులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. దీంతో ఎన్ని సార్లు దాడులు చేసినా పోలీసులకు జూదరులు దొరికేవారు కాదు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి ఎస్పీ తుషార్‌డూడీ ఏర్పాటు చేసిన ప్రత్యేక టీమ్, చుండూరు పోలీసులు కలిసికట్టుగా మంగళ వారం యడ్లపల్లి నిమ్మతోటల్లోని జూద శిబిరాలను డ్రోన్ కెమెరాల సహాయంతో గుర్తించారు. అనంతరం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి పేకాడుతున్న 20 మందిని గుర్తించారు. ఇంతలో డ్రోన్ కెమెరాను గుర్తించిన జూదరులు పారిపోయేందుకు ప్రయత్నించగా అప్పటికే చుట్టుముట్టిన పోలీసులు పది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 10,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రహిమాన్ తెలిపారు.



ఉదయం హంస వాహనంపై దర్శనమిచ్చిన నృసింహుడు

## హంస, గజ వాహనాలపై శ్రీవారి గ్రామోత్సవం

మంగళగిరి సిటీ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామి మంగళవారం రెండు వాహనాలపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం హంస వాహనంపై గ్రామోత్సవంలో పాల్గొన్నారు. పాలను, నీటిని వేరు చేసే స్వచ్ఛమైన పాలనుగ్రోలు హంస వలె భక్తుల పాపాలను వేరుచేసి పుణ్యాత్ములుగా చేసేందుకు శ్రీవారు హంస వాహనంపై దర్శనమిస్తారని అర్చకస్వాములు వివరించారు. ఈ ఉత్సవానికి వేదాంత వెంకట రమణాచార్యులు జ్ఞాపకార్థం భార్య గోపాల సత్యవతి, కుమారుడు వేణుగోపాల వాసుదేవ భట్టర్ కైంకర్యపరులుగా వ్యవహరించారు. సాయంకాలం స్వామి గజ వాహనంపై పురవీధుల్లో విహరించారు. గజ వాహన ఉత్సవాన్ని దర్శించిన యెడల మొసలి బారి నుంచి తన భక్తుడైన గజేంద్రుని రక్షించిన విధంగా సంసారమనే మొసలి బారి నుంచి తన భక్తులను కాపాడి రక్షించి ముక్తిని ప్రసాదిస్తారని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవానికి పాతమంగళగిరి పద్మశాలీయ సంఘం వారు కైంకర్యపరులుగా వ్యవహరించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన దేవతామూర్తుల వేషధారణలు, కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

# పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట



## పీ-4 సర్వేకు సహకరించాలి: కమిషనర్ శ్రీహరిబాబు

చిలకలూరిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక అసమానతలను తొలగించి ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు పబ్లిక్-ప్రైవేట్-పీపుల్-పార్టనర్‌షిప్ (పీ-4) సర్వేకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు మంగళవారం తెలిపారు. విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 8 నుంచి ప్రారంభమైన ఈ సర్వే 18వ తేదీ వరకు పురపాలక సంఘ పరిధిలో కొనసాగుతుందని చెప్పారు. ఇందుకోసం సర్వే సిబ్బంది ఇళ్లకు వచ్చినప్పుడు వారు అడిగిన వివరాలు చెప్పి సహకరించాలని కోరారు. పథకాలు తొలగించరని ఈ సర్వే వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది ఉండదని ఆయన స్పష్టం చేశారు.

## ఏప్రిల్ ఆఖరు వరకు సాగునీరు విడుదల చేయాలి

● పీడీఎం నాయకులు డిమాండ్

నరసరావుపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సాగుకు ఏప్రిల్ నెలాఖరు వరకు నీరు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేట మండలం రావిపాడు పరిసర గ్రామాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీఎం నాయకులు మాట్లాడుతూ నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో మిర్చి, పసుపు, దాళ్వా వరి సాగుచేస్తున్నారన్నారు. సాగునీరు నిలిపివేసి వారబందీ విధించడం వలన రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. వారబందీని రద్దు చేసి ఏప్రిల్ చివరి వరకు సాగునీరు అందించాలని రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వరరావు, రామకృష్ణ, షేక్ మస్తాన్ వలి తదితరులు పాల్గొన్నారు.

## మాతృ,శిశు మరణాలపై సమీక్ష

నరసరావుపేట లీగల్, మార్చి 11, (ఆంధ్రజ్యోతి), జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ చాంబర్లో మంగళవారం పల్నాడు ఉప జిల్లా స్థాయి మాతృ శిశు మరణాలపై సమీక్ష నిర్వహించారు. సమావేశానికి డీఎంహెచ్‌వో డాక్టర్ బి రవి అధ్యక్షత వహించారు. సమావేశంలో సిరిగిరిపాడు, ఆరేపల్లి ముప్పాళ్ళ పరిధిలో జరిగిన రెండు మాతృ మరణాలు, రామిరెడ్డిపేట యూపీహెచ్‌సీ, సత్తెనపల్లి, వినుకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జరిగిన మూడు శిశు మరణాలపై సమీక్షించారు. కార్యక్రమంలో డాక్టర్ పద్మావతి, డాక్టర్ గీతాంజలి, డాక్టర్ మంత్రు నాయక, డాక్టర్ లక్ష్మణరావు, బి సురేఖ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు, ఆశాలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

నరసరావుపేట రూరల్, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వెనుకబడిన వర్గాలు, ఈడబ్ల్యూఎస్ వర్గాల కార్పొరేషన్, కాపు కార్పొరేషన్ రుణాల కోసం ప్రభుత్వ ఆదేశాల మేరకు దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు నరసరావుపేట మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు మంగళవారం ప్రకటన తెలిపారు. నరసరావుపేట పురపాలక పరిధిలో గల వెనుకబడిన వర్గాలు, కాపు వర్గాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ నెల 22వ లోపు వ్యక్తిగత సబ్సిడీ రుణాల కోసం పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

● వినుకొండ టౌన్: వినుకొండ మునిసిపల్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మునిసిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ నుంచి 22వ తేదీ వరకు కార్యాలయంలో దరఖాస్తులను అందచేయాలన్నారు. అర్హత కలిగిన కమ్మ, రెడ్డి, కాపు, ఆర్యవైశ్య, క్షత్రియ, బ్రాహ్మణుల కార్పొరేషన్లకు సంబంధించిన లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందచేయనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఏపీ.ఓబీఎంఎస్ఎస్ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## పలు తండాల్లో నవోదయం-2

ఈపూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారుచేసినా, విక్రయించినా చట్టరీత్యా నేరమని వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ ఎం.రవికుమార్‌రెడ్డి అన్నారు. నవోదయం-2 కార్యక్రమంలో భాగంగా ఈపూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బ్రిడ్జితండా, బోడి తండాలలో నాటుసారా వలన కలిగే అనర్థాలపై తండావాసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గుంటూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండ్ ఐ.సూర్యనారాయణ, సీఐ డీ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కే శ్రీనివాసరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ రెహమాన్, సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా అనుమానిత ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు.

## వెంగళరెడ్డినగర్‌లో గృహం దగ్ధం

నర్సరావుపేట లీగల్, మార్చి 11, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంగళరెడ్డి నగర్‌లో షేక్ నాగూర్‌కు చెందిన గృహంలో మంగళవారం ఉదయం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. స్థానికులు వెంటనే అగ్నిమాపకశాఖ కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 1,50,000 విలువైన ఫర్నిచర్ దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ సిబ్బంది తెలిపారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ మునిసిపల్ కార్మికుల నిరసన

వినుకొండ టౌన్, మార్చి 11, (ఆంధ్రజ్యోతి) మునిసిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ విజయవాడ కళామందిర్ సెంటర్‌లో జరిగిన ధర్నా కార్యక్రమానికి వినుకొండ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మునిసిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో మంగళవారం తరలివెళ్లారు. ముందుగా శివయ్య స్థూపం సెంటర్‌లో కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేసి, అనంతరం విజయవాడకు తరలివెళ్లారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంపెంగుల అబ్రహం రాజు, రేవెళ్ల శ్రీనివాసరావు, నాగూర్, శివ, గురుమూర్తి, సాయి, స్వామి, తదితరులు ఉన్నారు.

# కనీస సౌకర్యాలు లేని శివారు కాలనీ



డ్రెయినేజీ లేక వీధిలో నిలబడిన నీరు



మిద్దెబావి కాలనీలో సీసీ రోడ్డు లేని వీధి

● 1999లో ఏర్పాటైన మిద్దెబావి, సుందరయ్య కాలనీ

● నేటికీ రోడ్లు, డ్రెయిన్లు, నీటి వసతి కరువు

● ఇక్కట్లు పడుతున్న 1500 పైగా కుటుంబాలు

● కూటమి ప్రభుత్వం పట్టించుకోవాలని వేడుకోలు

వినుకొండ, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వినుకొండ పరిధిలో కూతవేటు దూరంలో ఉన్న మిద్దెబావి, సుందరయ్యకాలనీ, ఘాట్‌రోడ్డుకు ఆనుకొని ఉన్న నివాసాల ప్రజలకు కనీస వసతులు లేక ఇక్కట్లు పడుతున్నారు. సీసీ రోడ్లు, డ్రెయినేజీ కాలువలు, విద్యుత్, వీధి లైట్లు, తాగేందుకు నీరు కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఐదు సంవత్సరాలకొకసారి ప్రభుత్వం మారుతుందే కాని 25 సంవత్సరాల క్రితం అంటే 1999 సంవత్సరంలో అప్పుడు అధికారంలో ఉనటువంటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో నాటి శాసనసభ్యుడు డాక్టర్ వీరపనేని యలమందరావు పట్టణంలోని 970 నిరుపేద కుటుంబాలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. కాలక్రమేణా ఆ ప్రాంతం మిద్దె బావి కాలనీగా రూపుదాల్చగా దానికి ఆనుకొని సుందరయ్యకాలనీ ఏర్పాటైంది. అనంతరం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి కానీ శివారు కాలనీల్లోని నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉండే ప్రజల సమస్యలు మాత్రం ప్రభుత్వాలకు పట్టడం లేదు. చీకటి పడితే వీధిలైట్లు లేక చిమ్మ చీకటిలోనే విషసర్పాలతో భయపడుతూ కాలం వెళ్లదీస్తున్నామని కాలనీవాసులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. నేడు 1500 కుటుంబాలకు పైబడి ఇళ్ల నిర్మాణాలు ఆయా పరిసర ప్రాంతాల్లో జరిగినట్టు స్థానికులు తెలియజేస్తున్నారు. ఈ ప్రాంతాన్ని వార్డులుగా విభజించి ఇంటి పన్ను, తాగునీరు ఏర్పాటు చేసి నీటి పన్ను కల్పించాలని స్థానికులు వేడుకుంటున్నారు. సంవత్సరాలు దాటినా కానీ నేటివరకు ఒక ప్రాథమిక పాఠశాల కానీ, అంగన్‌వాడీ సెంటర్ కానీ, ప్రాథమిక వైద్యశాల కానీ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయి. ఎన్నికల ముందు ఓట్లు దండుకునేందుకు మాత్రమే శివారు కాలనీలు కనిపిస్తున్నాయని, ఎన్నికలు అయిపోగానే ఏ రాజకీయ నాయకుడు కంటికి కూడా కనిపించడం లేదని స్థానికులు ఆగ్రహంతో ఉన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు స్పందించి విద్య, వైద్యం, మంచినీరు, సీసీ రోడ్లు, తాగునీరు, డ్రెయినేజీ కాలువలు ఏర్పాటు చేయాలని ఆయా కాలనీ వాసులు కోరుతున్నారు.



మిద్దెబావి కాలనీలోని ఖాళీ స్థలాల్లో అడవిలా ముళ్లచెట్లు



మిద్దెబావి కాలనీలో పనిచేయని చేతి పంపు

## పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి

● డీఈవో చంద్రకళ



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో ఎల్ చంద్రకళ

నరసరావుపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో జరిగే పదో తరగతి దూర విద్య పబ్లిక్-2025 పరీక్షలు పకడ్బందీగా ఎటువంటి లోపాలు లేకుండా విద్యార్థులకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ అన్నారు. మంగళవారం స్థానిక లింగంగుంట్ల శంకరభారతీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డీఈవో ఎల్ చంద్రకళ మాట్లాడుతూ పదో తరగతి (దూరవిద్య) సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో జరగబోయే మార్చి 2025 పబ్లిక్ పరీక్షలకు సంబంధించిన 14 అధ్యయన కేంద్రాల నుంచి మొత్తం 1200 మంది విద్యార్థులు 27 పరీక్షా కేంద్రాలలో పరీక్షలకు విద్యార్థులు హాజరవుతారన్నారు. దీనికి సంబంధించి 27మంది చీఫ్ సూపరింటెండెంట్‌లు, 27 డిపార్టుమెంట్ ఆఫీసర్‌లు, 28మంది సిట్టింగ్ స్క్వాడ్‌లను, 57మంది ఇన్విజిలేటర్లను నియమించటం జరిగిందన్నారు. ఈ నెల 17 నుంచి 28వ తారీఖు వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షల నిర్వహిస్తారని చెప్పారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్‌ల విధులు పూర్తిగా సార్వత్రిక విద్యాపీఠం కరదీపిక ద్వారా వివరించడం జరిగిందన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులకు వారి పరిధిలోని పరీక్షా కేంద్రాల లోని అన్ని వసతులను పరిశీలించవలసిందిగా ఆదేశించామన్నారు. సంబంధిత తహసీల్దార్ సహకారంతో పరీక్షా కేంద్రాల వద్ద 144వ సెక్షన్ విధించి పరీక్షలను సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలన్నారు.

కార్యక్రమంలో జిల్లా సార్వత్రిక విద్యా పీఠం సమన్వయకర్త కేఎంఏ హుసేన్, ఉప విద్యాశాఖాధికారులు ఎస్ఎం సుభాని, వీ ఏసుబాబు, రిసోర్స్‌పర్సన్ బీవీఎల్ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## కోడెల శివప్రసాద్‌పై అవినీతి కేసులు పెట్టించారన్నది అవాస్తవం

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట రూరల్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్‌పై అవినీతి కేసులు పెట్టించారన్నది అవాస్తవమని మాజీ శాసనసభ్యుడు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మాజీ శాసన సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు చిన్నపాటి కేసులకు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదన్నారు. గత ప్రభుత్వంలో కోడెల శివరాంపైనే అవినీతి ఆరోపణలు కేసులు నమోదయ్యాయన్నారు. కేవలం అసెంబ్లీ ఫర్నీచర్ సంబంధించిన కేసులో మాత్రమే కోడెల శివప్రసాద్‌రావు ఉన్నారని తెలిపారు. ఇటువంటి చిన్నపాటి కేసులకు కోడెల భయపడి బలవన్మరణం పొందే వ్యక్తి కాదని, మృతి వెనుక ఎవరున్నారు అన్నది నరసరావుపేట, సత్తెనపల్లి ప్రజలందరికీ తెలుసన్నారు. వినుకొండ రోడ్డులోని వెంచర్లు ప్రభుత్వ భూమి ఉందని ఆరోపణలు చేస్తున్నారని ఆ వెంచర్లో ప్రభుత్వ భూమి లేదని తహసీల్దార్ స్వయంగా పరిశీలించి వివరణ ఇవ్వటం జరిగిందని అన్నారు. 2019 సంవత్సరంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో కోడెల శివరాం వలన ఆర్థికంగా నష్టపోయిన వారంతా తనను కలవడం జరిగిందన్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆంధ్ర మాజీ రంజీ క్రికెటర్ నాగరాజుతో ఎంపీ విజయసాయిరెడ్డి, తాను కేసులు పెట్టించామనేది అవాస్తవమన్నారు. వాస్తవానికి నాగరాజు కోడెల శివరాంకు 15 లక్షలు నగదు ఇచ్చి, ఆ నగదును తిరిగి ఇప్పించాలని తమ వద్దకు వచ్చి ఇప్పుడు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని అన్నారు.

## వంశీకృష్ణకు ఘన నివాళి

చిలకలూరిపేట, మార్చి11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఈ నెల 2న అమెరికాలో మృతి చెందిన విద్యార్థి కందిమళ్ళ వంశీకృష్ణ (25) మృతదేహాన్ని మంగళవారం ఉదయం చిలకలూరిపేట మండలంలో అతడి స్వగ్రామమైన వేలూరుకు తీసుకువచ్చారు. తెల్లవారుజామున రెండు గంటల ప్రాంతంలో విమానంలో హైదరాబాదుకు వచ్చిన వంశీకృష్ణ మృతదేహాన్ని అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. వంశీకృష్ణ మృతదేహాన్ని పెద్ద సంఖ్యలో గ్రామస్థులు తరలివచ్చి ఘనంగా నివాళులర్పించారు.

## రేపు విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు

చిలకలూరిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక, విజయవాడ వారి ఆధ్వర్యంలో ఈ నెల 13న చిలకలూరిపేటలో విద్యుత్ వినియోగదారుల న్యాయ సదస్సు నిర్వహిస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై ఏడుకొండలు మంగళవారం తెలిపారు. గుంటూరు టౌన్ 2 డివిజన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై తక్షణ పరిష్కారం కోసం ఈ సదస్సును ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. చిలకలూరిపేట సుబ్బయ్యతోటలోని 33/11కేవీ విద్యుత్ ఉప కేంద్ర కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సదస్సు నిర్వహించబడుతుందని తెలిపారు.

## వైభవంగా ఈపూరు ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ళ

ఈపూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఈపూరు బోటు మీద ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ మంగళవారం వైభవంగా జరుపుకున్నారు. తిరునాళ్ళను పురస్కరించుకొని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేకువజామునుంచే స్వామివారిని దర్శించుకున్నారు. శివశక్తి లీల అండ్ అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పులిహోర, తాగునీరు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, మండల టీడీపీ అధ్యక్షుడు బాలయ్య, డీసీ వేణుగోపాల్ సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరి శాంతారావు, కోటేశ్వరరావు, రామయ్య, సైదులు, సుబ్బారావులు పంపిణీ చేశారు. తిరునాళ్ళకు ఈపూరు, యర్రబాలెం, గోపువారిపాలెం గ్రామస్థులు నాలుగు భారీ విద్యుత్ ప్రభలను నిర్మించి వాటిపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

## రైతుల సమస్యలను పట్టించుకోవాలి: ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

చిలకలూరిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మిరప, పత్తి రైతులు నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులు లభించక తీవ్రంగా నష్టపోతున్నారని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ శాసనమండలిలో ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. రైతులకు పెట్టుబడి కూడా రాక ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత తీసుకొని రైతులకు అండగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## 120 మైక్రాన్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

వినుకొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి) మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్లాస్టిక్ దుకాణాల్లో మంగళవారం తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఇస్మాయిల్ మాట్లాడుతూ 120 మైక్రాన్స్ కంటే తక్కువగా ఉన్న ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, థర్మాకోల్స్ ప్లాస్టిక్ షీట్స్, గ్లాసులు, జెండాలు మొదలైనవి అమ్మటం ప్రభుత్వం నిషేధించిందన్నారు.పట్టణంలోని అన్ని ప్లాస్టిక్ హోల్‌సేల్, రిటైల్ షాపులలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించామని తెలిపారు. నిషేధిత ప్లాస్టిక్ అమ్మినా, కొన్నా రూ.5 వేలు జరిమానా, చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: నిషేధిత ప్లాస్టిక్ కవర్లపై నరసరావుపేట పురపాలక సంఘ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు పట్టణంలోని మునిసిపల్ బాయ్స్ హైస్కూల్ వద్ద నుంచి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిషనర్ జస్వంత్‌రావు మాట్లాడుతూ నిషేధిత కవర్లను ఉపయోగిస్తే చర్య తీసుకుంటామన్నారు.

## వైసీపీ అరాచక పాలనకు యువతే చరమగీతం పాడారు: కోటిరెడ్డి

నరసరావుపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ సాగించిన అరాచక పాలనకు రాష్ట్రంలో యువత చరమగీతంపాడి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి ప్రతిపక్ష హోదా లేకుండా చేశారని తెలుగు యువత పల్నాడు జిల్లా అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ పల్నాడు జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కుమ్మెత కోటిరెడ్డి మాట్లాడుతూ 12న జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టబోయే ఫీజు పోరుపై నిరసన చేసే హక్కు లేదన్నారు. టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ళ అరాచక పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్ ఆయా విద్యాసంస్థలకు రూ.4270 కోట్లు బకాయిలు పెట్టారని, కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రూ.700 కోట్లు విడుదల చేసిందన్నారు. సమావేశంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ మహమ్మద్ రఫీ, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా రవీంద్ర, కార్యదర్శి అబ్దుల్ రహమాన్, నాగూర్, యేనుగంటి సాయి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చిన కూటమి ప్రభుత్వం

● టీడీపీ అంగన్‌వాడీ, డ్వాక్రా జిల్లా అధ్యక్షురాలు రాధిక

నరసరావుపేట టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పని చేస్తుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చిందని టీడీపీ అంగన్‌వాడీ, డ్వాక్రా జిల్లా అధ్యక్షురాలు కోసూరి రాధిక అన్నారు. మంగళవారం నరసరావుపేటలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కోసూరి రాధిక మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు నిధులు మంజురు చేసిందన్నారు. అంగన్‌వాడీలకు ఒకటో తేదీన జీతాలు అందిస్తోందని, గ్రాట్యుటీ పెంచిందని, 62సంవత్సరాలకు వయో పరిమితి పెంచిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు. వైసీపీ ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలను పట్టించుకోకుండా వారి మీద ఎస్మా చట్టాన్ని ప్రయోగించి ఇబ్బందులకు గురిచేశారని, సంక్షేమ పథకాలు అమలుకాకుండా అంగన్‌వాడీలను మోసం చేశారని విమర్శించారు. సమస్యలు ఉంటే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకొని వెళ్తాం అన్నారు. సమావేశంలో ఉడతా రాజ్యలక్ష్మి, అనూష పాల్గొన్నారు.

## స్టేట్ బ్యాంక్ ఎదుట బ్యాంకు ఉద్యోగుల నిరసన

చిలకలూరిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బ్యాంకు ఉద్యోగులపై అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పట్టణంలోని అన్ని ప్రభుత్వ బ్యాంకులకు చెందిన ఉద్యోగులు యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక స్టేట్ బ్యాంకు ఎదుట నిరసన ప్రదర్శన జరిపారు. ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## ఆంజనేయస్వామి ఆలయం వద్ద అభివృద్ధి పనులు

రొంపిచర్ల, మార్చి 11 (ఆంధ్రజోతి): మండలంలోని మర్రిచెట్టుపాలెం వద్ద ఉన్న సంజీవ ఆంజనేయస్వామి ఆలయం వద్ద దాత సహకారంతో పలు అభివృద్ధి పనులను చేపట్టారు. రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డీపీఎంవోగా సేవలు అందించిన చట్టు సత్యనారాయణ, సైదమ్మ దంపతులు ఆలయ ఆవరణలో పలు అభివృద్ధి పనులు చేయించారు. చట్టు సత్యనారాయణ తన తల్లిదండ్రులు చట్టు నరసయ్య, వెంకాయమ్మ జ్ఞాపకార్థం రూ.5 లక్షల వ్యయంతో పొంగిలి షెడ్డు, గేటు, బోరు పంపును ఏర్పాటుచేశారు. చట్టు నరసయ్య గతంలో రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేశారు. అనంతరం సత్యనారాయణ ఈ ఆస్పత్రిలోనే సేవలందించారు.

## ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం

● అడ్డుకున్న పంచాయతీ అధికారులు



గ్రామ సచివాలయ ప్రాంగణంలో నిర్మాణానికి తీసిన గొయ్యి

యడ్లపాడు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిని ఆక్రమించి శాశ్వత కట్టడాన్ని నిర్మించేందుకు అక్రమార్కులు చేసిన ప్రయత్నాన్ని పంచాయతీ అధికారులు అడ్డుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. సేకరించిన సమాచారం ప్రకారం.. మండల కేంద్రమైన యడ్లపాడు జాతీయ రహదారికి ఆనుకుని గ్రామ సచివాలయం-1 భవనం ఉంది. సచివాలయం సచివాలయం ముందు ఖాళీగా ఉన్న ప్రాంగణంపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి కన్నుపడింది. అందులో శాశ్వత కట్టడం నిర్మించడానికి సోమవారం మార్కింగ్ ఇచ్చి భూమిపూజ కూడా చేశాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి శశికళ అదేరోజు శంకుస్థాపన చేసిన ప్రదేశాన్ని పరిశీలించి ఇది గ్రామ సచివాలయ ప్రాంగణమని, ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం ఎలా చేస్తావంటూ ప్రశ్నించారు. పనులను నిలిపివేయాల్సిందిగా ఆదేశించారు. సచివాలయ స్థలంలో ఎలాంటి నిర్మాణం జరిపినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ధర్నాలకు జగన్ పిలుపు ఇవ్వడం సిగ్గుచేటు: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు విద్యార్థులకు రూ.6,500కోట్లు ఎగ్గొట్టిన జగన్, ఇప్పుడు ధర్నాలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం రాష్ట్ర శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రాష్ట్ర విద్యారంగం-ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులపై జరిగిన చర్చలో మాట్లాడుతూ అన్నారు. నాడు-నేడు పథకంపై సమగ్ర విచారణ జరిపి విద్యార్థుల జీవితాలతో ఆటలాడిన అవినీతిపరులను కఠినంగా శిక్షించాలని మంత్రి లోకేశ్‌ను కోరుతున్నానని చెప్పారు. 12 లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యేలా చేయడమే జగన్ విద్యారంగంలో సాధించిన ప్రగతి అని పేర్కొన్నారు. జగన్ హయాంలో 12 లక్షల విద్యార్థులు విద్యకు దూరమయ్యారని, 587 పాఠశాలలు మూతపడ్డాయని, 1,365 ఎయిడెడ్ విద్యాసంస్థలకు తాళాలుపడేలా వ్యవహరించారని అన్నారు.

## మాజీమంత్రి రజిని వ్యాఖ్యలపై టీడీపీ నాయకుల ధ్వజం

చిలకలూరిపేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలను, కార్యకర్తలను అక్రమ కేసులలో ఇరికించి, జైలుకు పంపి కక్ష సాధింపు చర్యలకు కూటమి ప్రభుత్వం పాల్పడుతున్నదని మాజీమంత్రి విడదల రజిని చేసిన వ్యాఖ్యలను స్థానిక టీడీపీ నాయకులు మంగళవారం ఖండించారు. వైసీపీలో వారు చేసిన తప్పులకు వారే శిక్ష అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. రజిని చెప్పే అసత్యాలను సొంత పార్టీ వారు కూడా నమ్మే స్థితిలో లేరని చెప్పారు. అధికారం వెలగ బెట్టిన రోజుల్లో సోషల్ మీడియాలో సభ్య సమాజం తల దించుకునేలా రాతలు రాయించి, వికృత ఆనందాన్ని పొందిన రజినికి ఇప్పుడు మాట్లాడే నైతిక అర్హత ఎక్కడిదని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, షేక్ అబ్దుల్ భాషా, పిల్లి కోటి, ఫ్రాన్సిస్, గట్టుపల్లి మాణిక్యారావు తదితరులు పాల్గొన్నారు.

## వనరుల సద్వినియోగంతో మహిళలకు ఆర్థిక స్వావలంభన

● పీడీ హీరాలాల్ నాయక్

నాదెండ్ల, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): సామాజిక వనరులను సరైన విధంగా సద్వినియోగం చేసుకున్నప్పుడు మాత్రమే మహిళలు ఆర్థిక స్వావలంభన సాధించగలుగుతారని డీఆర్‌డీఏ పీడీ కే హీరాలాల్‌నాయక్ అన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో శుభోదయ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆరోగ్య ఉప కమిటీలకు, సామాజిక కార్యవర్గ కమిటీలకు జరిగిన శిక్షణ కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డీపీఎం ఇన్‌చార్జ్ ప్రియదర్శిని, లీగల్ అడ్వయజర్ కంభంపాటి వాణిశ్రీ, ఏపీఎం ఎం రమేష్ బాబు, సీసీలు సాంబశివరావు, హేమలత, సుధ, నాగూర్ తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు మౌలిక వసతులు కల్పించాలి

● అసిస్టెంట్ డైరెక్టర్ సువార్తమ్మ



కారుమంచిలో రికార్డులు పరిశీలిస్తున్న సువార్తమ్మ

కారుమంచి (శావల్యాపురం) మార్చి 11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు మౌలిక వసతులు కల్పించాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ డిజెబులిటీ డిపార్ట్‌మెంట్ సువార్తమ్మ అన్నారు. శావల్యాపురం మండలం కారుమంచిలో కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో నిర్వహిస్తున్న సరోజినీదేవి మెమోరియల్ సొసైటీ స్కూల్‌ను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులు ఇరుకుగా ఉండడాన్ని గమనించి అదనపు తరగతి గదులను ఏర్పాటు చేయాలని, లేకుంటే విశాలమైన భవనాన్ని అద్దెకు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితాకుమారి, హెచ్ఎం సుధాకర్, ఉపాధ్యాయులు జి.అంకమ్మరావు, జాజం నాగేశ్వరరావు, రాజ్యలక్ష్మి, అనూష, రత్నకుమారి పాల్గొన్నారు.

## పౌరాణిక కళాకారుడు గోవింద్‌కు బంగారు నంది అవార్డు

వినుకొండ టౌన్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ, జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించి అవార్డు ప్రధాన కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గంలోని ఏనుగుపాలెంకు చెందిన గుడిపూడి గోవింద్ సత్యహరిచంద్ర, చింతామని పౌరాణిక పద్యనాటకాల్లో మంచి గుర్తింపు, పేరు ప్రతిష్ఠలు సంపాదించినందుకు గుర్తింపుగా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వీఆర్ శ్రీనివాసరాజు, మహిళా కో ఆపరేటర్ చైర్‌పర్సన్ బండారు శోభారాణి సన్మానించి, నేషనల్ బంగారు నంది అవార్డు మంగళవారం అందచేశారు.

## రీ సర్వేకు రైతులు సహకరించాలి: తహసీల్దారు నళిని



గ్రామ సభలో మాట్లాడుతున్న తహసీల్దారు నళిని

ఈపూరు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలూరులో భూముల సర్వే జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం రైతు భరోసా కేంద్రం వద్ద గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో మొత్తం 1253 ఎకరాల భూములు ఉండగా వాటిలో 905 ఎకరాలు ఉత్తరాది మఠంకు చెందినవి కాగా 195 ఎకరాలు ఈనాం భూములు, 153 ఎకరాలు ప్రభుత్వ భూములు (అంటే రోడ్లు, డొంకలు, వాగులు) ఉన్నాయి. ఆ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు వాటిపై హక్కులేదు. భూములపై హక్కు కల్పించేందుకు ప్రభుత్వం సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు, ఉత్తరాది మఠం ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు మాట్లాడుతూ సర్వే సజావుగా జరిగేలా రైతులు అధికారులకు సహకరించాలన్నారు. అలాగే రైతులు సాగు చేసుకుంటున్న భూములకు సంబంధించిన పత్రాలు ఉంటే తీసుకురాలన్నారు. అంతేకాకుండా మఠం భూములు సర్వేచేసి రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వాలంటే కొంతమేర మఠం ప్రతినిధులకు ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు. న్యాయపరమైన ధర చెల్లించేందుకు రైతులు సుముఖంగా ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం ఎవరైతే రైతులు సాగు చేసుకుంటున్నారో వారికి హక్కు కల్పించడం జరుగుతుందన్నారు. సభలో రెవెన్యూ అధికారులు, మఠం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.